## కన్న బిడ్డ దూరమైందని..

### సూసైడ్ చేసుకున్న తండ్రి



హైదరాబాద్, ఆగస్టు 28, ప్రభాతవార్త: కూతురికి నాన్నంటే ఎనలేని ఇష్టం.. నాన్నకు కూతురంటే ప్రాణం.. అల్లారుముద్దుగా పెంచుకున్న తన పాప ఏది అడిగినా క్షణాల్లో తెచ్చి ఇచ్చేవాడు నాన్న.. ఒకరిని విడిచి మరొకరు ఎప్పుడూ ఉన్నది లేదు. తన పాప స్కూల్‌కు వెళ్తుంటే.. నాన్న బాధపడేవాడు.. కూతురికి ఆరోగ్యం బాగలేదని తెలిసినప్పటి నుంచి నాన్న ఏడవని రోజు లేదు. పాప ఆరోగ్యం మెరుగుపడాలని మొక్కని దేవుడు లేదు. అనారోగ్యంతో కూతురు బాధపడుతుంటే చెప్పలేనంత ఆవేదనకు గురయ్యేవాడు. చివరికి తన ఐదేళ్ల కూతురిని దక్కించుకోవడానికి ఎన్ని ప్రయత్నాలు చేసిన పాప ప్రాణం దక్కలేదు. దీంతో ఆవేదన తట్టుకోలేక పాప లేని లోకంలో నేను ఉండలేనని నిర్ణయించుకున్నాడు. ఆత్మహత్య చేసుకొని ప్రాణాలు వదిలాడు. ఈ విషాద ఘటన ఖైరతాబాద్‌లో జరిగింది. ఖైరతాబాద్‌లో నివాసముంటున్న కిషోర్ దంపతులకు ఐదేళ్ల పాప ఆరాధ్య ఉంది. అందరిలాగే తాను రోజు ఆడుకుంటూ స్కూల్‌కు వెళ్తూ ఉండేది. ఏమైందో ఏమోగాని అల్లారుముద్దుగా పెంచుకున్న పాప అనారోగ్యంతో అకస్మాత్తుగా చనిపోయింది. దీంతో తన కూతురు మృతిని తట్టుకోలేక తండ్రి కిషోర్ తీవ్ర ఆందోళనకు గురయ్యాడు. ఏం చేయాలో అర్థంకాని స్థితిలోకి వెళ్లిపోయి ట్రైన్ కిందపడి ఆత్మహత్య చేసుకున్నారు.



హైదరాబాద్ వార్త

## రోడ్డు దాటుతుండగా కారు ఢీకొట్టి యువతి మృతి



బేగంపేట ఆగస్టు 28, ప్రభాతవార్త : బేగంపేట ప్రకాష్ నగర్ మెట్రో స్టేషన్ వద్ద రోడ్డు దాటుతున్న ఓ యువతిని వేగంగా వెళుతున్న కారు ఢీ కొన్న ఘటనలో యువతి అక్కడి కక్కడే ప్రాణాలు కోల్పోయిన సంఘటన సోమవారం ఉదయం బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఈ సంఘటనపై ఎస్సై కోర్వ గంగాధర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి గ్రామం. బాబు క్యాంపుకు చెందిన చందా నాగ ప్రియాంక(30), ప్రకాష్‌నగర్‌లోని రిలయన్స్ ట్రెండ్జ్ భవనం లోని నాలుగో అంతస్థులోని ఓ ప్రయివేటు సంస్థలో ఉద్యోగం చేస్తుంది. ఆమె నిజాంపేటలో తల్లి దండ్రులతో కలిసి ఉంటుంది. ఎప్పటి లాగానే చందా నాగ ప్రియాంక సోమవారం ఉదయం క్యాబ్ లో బయలు దేరి ఉదయం గం 7.30నిలకు బేగంపేట షాపర్స్ స్టాప్ ముందు దిగింది. అక్కడి నుంచి రోడ్డు దాటుతుండగా పంజాగుట్ట నుంచి సికింద్రాబాద్ వైపు వెళుతున్న మహింద్రా మెరాజో కారు వేగంగా వచ్చి ఢీ కొట్టింది. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన బాధితురాలు అక్కడి కక్కడే మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న బేగంపేట పోలీసులు ప్రమాదానికి కారణమైన కారును గుర్తించి డ్రైవర్‌ను అరెస్ట్ చేసారు.

## కాలేజీ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంతో జిహెచ్‌ఎంసి కార్మికురాలు మృతి



హైదరాబాద్, ఆగస్టు 28, ప్రభాతవార్త: ఓ కాలేజీ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా జిహెచ్‌ఎంసి కార్మికురాలు మృతిచెందింది. ఈ ఘటన నగరంలోని రామ్‌కోఠిలో సోమవారం ఉదయం జరిగింది. కింగ్‌కోఠిలోని రోడ్లను సోమవారం ఉదయం 7 గంటల సమయంలో జిహెచ్ ఎంసి కార్మికురాలు డి.సునిత శుభ్రం చేస్తోంది. ఇదే సమయంలో మొయినాబాద్‌లోని అయాన్ ఇనిస్టట్యూట్ మెడికల్ సైన్సెస్‌కు చెందిన కాలేజీ బస్సు విద్యార్థులతో వెళ్తోంది. డ్రైవర్ మహ్మద్ గౌస్ వేగంగా బస్సును నడపడంతో అదుపు తప్పి రోడ్లను శుభ్రం చేస్తున్న సునీతను ఢీకొట్టింది. డ్రైవర్ వేగంగా బస్సు నడపడంవల్లే స్పాట్‌లోనే సునీత చనిపోయింది. ప్రమాదం జరగ్గానే వెంటనే స్థానికులు వెళ్లే సరికి సునీత రక్తపు మడుగులో పడిఉంది. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న నారాయణగూడ పోలీసులు.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. సునీత డెడ్‌బాడీని పోస్టుమార్టం కోసం ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతురాలు ముషీరాబాద్ నియోజకవర్గంలోని రాంనగర్‌లో నివాసం ఉంటుందని పేర్కొంటున్నారు. ఈ ప్రమాదంలో నలుగురు విద్యార్థులు కూడా గాయపడ్డారు. సునీత మృతికి కారణమైన బస్సు డ్రైవర్ మహ్మద్‌గౌస్‌పై నారాయణగూడ పోలీసులు కేసు నమోదు చేశారు.

### నిరాశ్రయులైన నిరుపేద కుటుంబానికి అండగా ప్రభుత్వం

సంజీవరెడ్డి నగర్, ఆగస్ట్ 28, ప్రభాతవార్త : ఎదుటి వ్యక్తుల బాధను తమ కష్టంగా భావించే గొప్ప వ్యక్తి, కష్టాల్లో ఉన్నవారికి బాసటగా నిలిచిన వ్యక్తి ముఖ్యమంత్రి కెసిఆర్ అని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. అకాల వర్షాలతో ఇల్లు కూలిపోయిన బాధిత కుటుంబానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచి ఆర్థిక సహాయాన్ని అందజేసిందన్నారు. సనత్‌నగర్ డివిజన్ అల్లా ఉద్దీన్ కోటిలోని షబానా బేగంకు చెందిన ఇల్లు జులై నెలలో కురిసిన వర్షాలకు కూలిపోయింది.

## పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

### డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్

సికింద్రాబాద్, ఆగస్టు 28 ప్రభాతవార్త: బీసీల సామాజిక, ఆర్థిక, రాజకీయ స్థితిగతులను మెరుగు పర్చడం ద్వారానే వారి స్వావలంబన సాధ్యపడుతుందని డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ తెలిపారు. సికింద్రాబాద్ నియోజకవర్గ బీసీ బంధు స్కీంను పద్మా రావు గౌడ్ సోమవారం సీతాఫల్‌మండిలోని క్యాంపు కార్యాలయంలో ప్రారంభించారు. బీసీ కులాలకు చెందిన వారికి ఆర్థికంగా ఉపకరించే, స్వయంగా ఉపాధిని కల్పించేందుకు వీలుగా రూ. లక్ష మేరకు ఆర్థిక సహకారాన్ని అందిస్తున్నామని, తిరిగి చెల్లించాల్సిన అవసరం లేని విధంగా ఉన్న ఆర్థిక సహకార పథకాన్ని సద్వినియోగం చేసుకోవా లని పద్మారావు గౌడ్ తెలిపారు. పథకం ద్వారా ఆర్థిక సహాయం పొందడానికి ఎవరికి లంచాలు ఇవ్వాల్సిన అవసరం లేదని చెప్పా రు. గృహలక్ష్మీ పథకంలో భాగంగా సొంత స్థలం కలిగి పక్కా ఇళ్లను కట్టుకోలేని నిరుపేదలకు రూ. 3 లక్షల మేరకు ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్ర మంలో డిప్యూటీ మేయర్ శ్రీలత, కార్పొరేటర్‌లు సామల హేమ, శైలజ, సునిత, ప్రసన్నలక్ష్మీ, నేతలు కిషోర్‌కుమార్ గౌడ్, రామేశ్వర్ గౌడ్, ఆర్‌డిఓ రవికుమార్, జిల్లా బీసీ సంక్షేమ అధికారి ఆశన్న, నోడల్ అధికారి మైత్రేయి పాల్గొన్నారు.

# చుట్టుముట్టిన ఫ్లూ వైరస్

- ఇంట్లో ఒకరి నుంచి ఒకరికి అస్వస్థత
- తుంపర్ల ద్వారా విస్తరిస్తున్న ఫ్లూ
- గాంధీ, ఫీవర్, ఉస్మానియాలో రోగుల క్యూ
- అన్ని జ్వరాలకు ఒకే రకమైన లక్షణాలు
- జలుబు, దగ్గు, విష జ్వరాలతో
- ఆసుపత్రులకు పరుగులు తీస్తున్న బాధితులు
- భయం వద్దు.. జాగ్రత్తలే ముఖ్యమంటున్న వైద్యులు





హైదరాబాద్, ఆగస్టు 28 ప్రభాతవార్త : నగరవ్యాప్తంగా వైరల్ ఇన్ఫెక్షన్లు, ఇన్‌ఫ్లూయెంజా కేసులు వేగంగా పెరుగుతున్నాయి. వాతావరణంలో మార్పుల కారణంగా నగరంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. జ్వరాలన్నింటికీ లక్షణాలు ఒకేలా ఉండటంతో ఏది ఏ జ్వరమో తెలియక తికమకపడుతున్నారు. వాతావరణంలో మార్పుల కారణంగా నగరంలో టైఫాయిడ్, డెంగ్యూ, జలుబు, దగ్గు తదితర విష జ్వరాలు ప్రబలుతున్నాయి. వారం రోజులుగా నగరంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు వస్తున్న రోగుల్లో సీజనల్ వ్యాధుల బాధితులే ఎక్కువగా ఉంటున్నారు. సాధారణ ఫ్లూతో పోలిస్తే వీరిలో కొంత భిన్న లక్షణాలు కనిపిస్తున్నాయని ఫీవర్ ఆస్పత్రి వైద్యులు చెబుతున్నారు. ఎక్కువ మందిలో 102 నుంచి 104 ఫారన్‌హీట్ వరకు తీవ్ర జ్వరం ఉంటోంది. 2-3 వారాల వరకు దగ్గు, తీవ్రమైన నీరసం వేధిస్తున్నాయి. తుంపర్ల ద్వారా ఫ్లూ వైరస్ ఇతరులకు వ్యాప్తిచెందుతోందని వైద్యులు పేర్కొంటున్నారు. ఇంట్లో ఒకరి నుంచి ఒకరు అస్వస్థతకు గురవుతున్నారు. చిన్నపిల్లలు కూడా తీవ్ర జ్వరం దగ్గు, గొంతు నొప్పి తదితర లక్షణాలతో బాధపడుతున్నారు. రోగ నిరోధక శక్తి తక్కువ ఉన్నవారు సులువుగా ఇన్‌ఫెక్షన్ బారిన పడుతున్నారు. తొలుత గొంతునొప్పి తర్వాత ఒక్కసారిగా జ్వరం పెరుగుతోంది. రెండు రోజుల్లో జ్వరం తగ్గినా దగ్గు తీవ్ర నీరసం మాత్రం కొనసాగుతోంది. ఫీవర్ ఆస్పత్రి, గాంధీ, ఉస్మానియా ఆసుపత్రులతో పాటు ప్రైవేటు ఆస్పత్రులు రోగులతో కిక్కిరిసిపోతున్నాయి. సాధారణ రోజుల్లో ఫీవర్ ఆస్పత్రిలో 500-600 మంది వరకు ఔట్‌పేషెంట్లుగా నమోదు అయ్యేవారు. సోమ, శనివారాల్లో ఓపి 800-900 మంది దాటుతున్నారు. వారిలో ఎక్కువగా దగ్గు, ఆయాసం, గొంతు నొప్పి తదితర లక్షణాలతో బాధపడుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. తమ వద్దకు వస్తున్న ప్రతి ఇద్దరు రోగుల్లో ఒకరు దగ్గు, జలుబు, వైరల్ ఇన్ఫెక్షన్లతో బాధపడుతున్నారని పేర్కొంటున్నారు. దీంతో చాలా మంది యాంటీబయోటిక్స్ తీసుకుంటున్నారు. వైరస్ కారణంగా ఈ ఇన్‌ఫెక్షన్లు వస్తున్నాయని, వీటికి యాంటిబయోటిక్స్ అవసరం లేదని నిపుణులు చెబుతున్నారు. బాధితుల్లో పిల్లలు, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారే ఎక్కువగా ఉంటున్నారని ఫీవర్ ఆస్పత్రివర్గాలు వివరిస్తున్నారు.

**పెరుగుతున్న డెంగ్యూ కేసులు..** ప్రస్తుతం వాతావరణంలో దోమలు కుట్టడం వల్ల డెంగ్యూ, చిగున్‌గున్యా తదితర వైరల్ ఫీవర్ వస్తుంటాయి. తాగునీటి వనరులు, ఆహార పదార్థాలు కలుషితం కావడం వల్ల టైఫాయిడ్, డెంగీ వంటి వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయి. నగరంలోని ప్రధాన ఆసుపత్రులకు రోగులు క్యూకటత్తారు. నగరంతో పాటు రాష్ట్రంలోని జిల్లాలకు చెందిన రోగులు పెద్ద సంఖ్యలో చేరుకోవడంతో ఓపి విభాగం కిక్కిరిసింది. రోగుల రద్దీకి అనుగుణంగా ఓపీ కంప్యూటర్ చిట్టీ కౌంటర్లు లేకపోవడంతో గంటల తరబడి క్యూలైన్లలో నిలబడే దుస్థితి దాపురించింది. రాష్ట్ర వ్యాప్తంగా చూస్తే కూడా ఏటేటా అత్యధికంగా హైదరాబాద్ నగరంలోనే డెంగీ కేసులు నమోదవుతాయి. మారుతున్న వాతావరణ పరిస్థితులతో దగ్గు, జలుబు, జ్వరం, వైరల్ ఫీవర్లు వ్యాపించే అవకాశం ఉందని ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఫీవర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శంకర్ సూచించారు. ఓపీ విభాగానికి వచ్చే ప్రతి ఒక్కరికి వైద్యసేవలు అందేలా కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నామని వివరించారు.

సీజనల్ వ్యాధులు ప్రబలడానికి ప్రధాన కారణం అపరిశుభ్రత, దోమలే. ప్రస్తుతం నగరంలో అడపాదడపా చిరు జల్లులు కురుస్తున్నందున బస్తీలు, కాలనీలలో పారిశుధ్య పరిస్థితులు అధ్వాన్నంగా తయారయ్యాయి. మురుగు కాల్వల్లో మురికినీరు నిల్వ పేరుకుపోయి వాటి నుంచి దోమల బెడత ఎక్కువవుతోంది. దోమలు కుట్టడం వల్ల డెంగ్యూ, చికున్‌గున్యా, మెదడువాపు వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదముంది. మరోవైపు వర్షపు నీటితో తాగునీటి వనరులు కలుషితమవుతున్నాయి. నగరంలోని బస్తీలు, కాలనీలతోపాటు శివారు ప్రాంతాలు, శివారు మున్సిపాలిటీల్లో రాత్రి పూట ఫాగింగ్ చేయాలి. ముఖ్యంగా బోడుప్పల్ వంటి మున్సిపల్ కార్పొరేషన్‌లో ఫాగింగ్ చేయడం లేదు. ఎక్కడైన డెంగ్యూ కేసులు నమోదైతే ఆయా ప్రాంతాలకు వెళ్లి ఇంటింటా ఫీవర్ సర్వే నిర్వహించాలి. రోడ్లపైన బహిరంగ ప్రదేశాల్లో చెత్తాచెదారాలు పేరుకుపోకుండా చూడాలి. మురుగు కాల్వల్లో పూడికతీత చేపట్టాలి. దోమల లార్వాను తినే చేపలను (గుబూజియా చేపలు)నీరు నిల్వ ఉన్నచోట్ల వదలాలి. కానీ ఈ కార్యక్రమాలేవి సక్రమంగా జరగట్లేదు. సమస్య తీవ్రమైనప్పుడే అధికారులు హడావుడి చేస్తున్నారు. వానల వేళ దోమల తీవ్రత పెరిగింది. రెండేళ్ళుగా డెంగీ, మలేరియా కేసులు తగ్గాయని జిహెచ్‌ఎంసి బెబుతోంది. ప్రభుత్వ ఆసుపత్రుల కేసులేమోగాని.. ప్రైవేటు ఆసుపత్రుల్లో మాత్రం డెంగ్యూ కేసులు పెరుగుతున్నాయి. దోమలు పగలు, రాత్రి నివాసం, కార్యాలయం అన్న తేడా లేకుండా వీరవిహారం చేస్తున్నాయి.


**తీసుకోవాల్సిన జాగ్రత్తలు..**

తరచూ సబ్బుతో శుభ్రంగా చేతులు కడుక్కోవాలి. జనం మధ్యలో ఉంటే మాస్క్ ధరించాలి. చేతులు శానిటైజ్ చేసుకోవాలి. కరచాలనంతో ఇన్‌ఫెక్షన్ వ్యాపించే ప్రమాదం ఉంది. కరచాలనం కంటే నమస్కారం చేయడం ఉత్తమం. జనసమర్థ ప్రాంతాల్లోకి మాస్క్ లేకుండా వెళ్లకూడదు. కళ్లు, ముక్కు, నోటిని అధికంగా తాకడం, రుద్దడం వంటివి మానాలి. బట్టలు, తువ్వాల, వాటర్ బాటిళ్ల వంటి వ్యక్తిగత వస్తువులను ఇతరులతో పంచుకో కూడదు. జ్వరం, దగ్గు, జలుబు, గొంతునొప్పి, ఊపిరితిత్తుల్లో ఇన్‌ఫెక్షన్ ఉంటే చల్లని పదార్థాలకు దూరంగా ఉండాలి.

## మహిళలు గౌరవింపబడితేనే దేశం సస్యశ్యామలమౌతుంది : దత్తాత్రేయ

రవీంద్రభారతి, ఆగస్టు 28 ప్రభాతవార్త : ఎక్కడైతే మహిళలు గౌరవింపబడతారో ఆ దేశమే సమగ్రాభివృద్ధితో సస్యశ్యామలం అవుతుందని హరియాణా రాష్ట్ర గవర్నరు బండారు దత్తాత్రేయ అన్నారు. మహిళ కంట తడిపెడితే ఆ ఇంటికి, కుటుంబానికి యావత్ దేశానికే అరిష్టం ఏమాత్రం మంచిది కాదన్న దత్తాత్రేయ నేటి సమాజంలో పురుషులతో సమానంగా మహిళలు విద్య మొదలుకొని అన్నిరంగాల్లో సర్వతోముఖాభివృద్ధి చెందుతున్నారని, చంద్రయాన్-3 విజయంతో మహిళల పాత్ర ఉందని గుర్తుచేస్తూ వారికి సమాన అవకాశాలు, గౌరవం కల్పించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని స్పష్టం చేశారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు మన కళల్లో ప్రతిబింబిస్తాయని వాటిని ప్రోత్సహిస్తూ విశ్వవ్యాప్తం చేయాలని తెలంగాణ నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ డా. ఎస్.వేణుగోపాలాచారి అనగా, తెలంగాణ బిసి కమిషన్ చైర్మన్ డా. వకుళాభరణం కృష్ణమోహన్‌రావు భారతీయ మహిళలు అన్నిరంగాల్లో పురోభివృద్ధి సాధించడం దేశానికే గర్వకారణమని కొనియాడారు.

### పారిశుధ్యానికి ప్రాధాన్యత: కమిషనర్ శరత్‌చంద్ర



బండ్లగూడ కార్పొరేషన్ పరిధిలో రోడ్లపై చెత్తను ఎత్తిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

నార్సింగి, ఆగస్టు 28 ప్రభాతవార్త : బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ పరిధి లో పారిశద్య నిర్వాహణకు తొలి ప్రాధాన్యతనిస్తున్నా మని కమీషనర్ శరత్ చంద్ర తెలిపారు. ఉదయం 5.గంటల నుంచే పబ్లిక్ హెల్త్ వర్కర్స్/స్వీపర్స్ రోడ్లపైకి వచ్చి చెత్తను తొలగిస్తున్నారని వివరించారు. ఇంద్రారెడ్డి బ్రిడ్జి నుంచి తెలంగాణ పోలీసు అకాడమి వరకున్న రేడియల్ రోడ్డుపై చెత్త లేకుండా చూస్తున్నామన్నారు. ఇళ్ల ముందుకు వస్తున్న ఆటోలలోనే చెత్తను వేయాలని, అలా కాకుండా చెత్తను రోడ్లపై వేస్తే అపరాధ రుసుం వసూలు చేస్తామని కమీషనర్ హెచ్చరించారు. జవాన్లు ఈ విషయంలో కఠినంగా వ్యవహరించాలని, ప్రజలందరూ కార్పోరేషన్ నిర్ణయాలకు సహకరించాల ని తెలిపారు. ఎక్కడ చెత్త, నీరు నిలువ ఉంటే అక్కడ అంటు రోగాలను వ్యాపింపచేసే దోమలు, ఈగలు వృద్ధి చెందుతాయన్నారు. సేకరణను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ రవి, శానిటరీ ఇంచార్జి నరేష్, జవాన్లు లక్ష్మీ నారాయణ, వెంకటేష్, మల్లేష్, రామాంజనేయులు, రాము తదితరులు పాల్గొన్నారు.

## వివేక్‌నగర్ ఆంజనేయస్వామి దేవాలయం హుండి ఆదాయం రూ.3,28,860



చిక్కడపల్లి, ఆగస్టు 28 ప్రభాతవార్త: వివేక్‌నగర్ శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం హుండి లెక్కింపు కార్యక్రమం సోమవారం ఆలయంలో ఆలయం ఈవో దేవనాథం, దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సురేఖ, ఈవో జ్యోతి పర్యవేక్షణలో జరిగింది. రెండు నెలలకుగాను హుండి లెక్కించగా రూ. 3,28,860 ఆదాయం వచ్చిందని, భక్తులకు మనోభావాలకు అనుగుణంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసేలా పూజలుంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయం ధర్మకర్తలు మురికి గణేష్, బాసాని పద్మసూర్యప్రకాశ్, అర్చకులు బుగ్గా లక్ష్మీపతి శర్మ, కె.వెంకటాద్రి, ఆచారి, భక్తబృందం సభ్యులు పాల్గొన్నారు.

## మద్యం మత్తులో హాల్‌చల్ చేస్తున్న యువతీ యువకుల అరెస్ట్

ధర్నాచౌక్, ఆగస్టు 28, ప్రభాతవార్త: మద్యం మత్తులో హాల్‌చల్ చేస్తున్న ఆరుగురు యువకులు, ఇద్దరు యువతులను ముషీరాబాద్ పోలీసులు ఆదివారం రాత్రి అరెస్ట్ చేశారు. ముషీరాబాద్ సీఐ జహంగీర్ యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం రాంనగర్ శ్రీనివాస టెక్స్‌టైల్స్ దగ్గర బుధవారం రాత్రి 11గంటల ప్రాంతంలో ముషీరాబాద్ ఎస్‌ఐలు స్వప్న, కళ్యాణి, ప్రసాద్‌రెడ్డిలు పెట్రోలింగ్ నిర్వహిస్తూ ఉండగా ఎం.రాహుల్ (21), శ్రేయ్‌వర్మ(20), రిషవ్‌కుమార్(20), చినార్ ధోతే(27), టి.వైభవ్ సింగ్ (21), సిద్ధార్థయాదవ్ (21), సాక్షి రాజేష్ కోలే (21), బ్లిస్ మేరియా(19) లు మద్యం సేవించి అల్లరి చేస్తూ రోడ్డు మీద కనిపించిన వారిపై రాళ్లు రువ్వుతూ న్యూసెన్స్ చేస్తున్నారు. పోలీసులు వారిని ఆపేందుకు ప్రయత్నించటంతో పోలీసులపై కూడా వారు తిరగబడి, దూషిస్తూ ఉండటంతో వారిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు.

### ఇతర రాష్ట్రాలకు చెందిన అక్రమ మద్యం పట్టివేత

ఉప్పల్, ఆగస్టు 28 ప్రభాతవార్త : ఇతర రాష్ట్రాలకు చెందిన మద్యాన్ని తెచ్చి నగరంలో విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను ఉప్పల్ ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎక్సైజ్ సిఐ చంద్రశేఖర్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్‌కు చెందిన రిటైర్ట్ ఆర్మీ ఉద్యోగి కీలక సూత్రదారిగా పనిచేస్తున్న ఈ అక్రమ మద్యం బాగోతాన్ని పోలీసులు గుట్టు రట్టు చేశారు. నగరంలోని అసిఫ్‌నగర్‌కు చెందిన మనీష్ అగర్వాల్ 30, కార్వాన్‌కు చెందిన రాచకొండ అరుణ్‌కుమార్31, మణికొండ శివబాగ్‌కు చెందిన రేగటి శ్రీను 40, మధ్యప్రదేశ్‌కు చెందిన రిటైర్ట్ ఆర్మీ ఉద్యోగి భగవాన్‌దాస్ అలి యాస్ పంకజ్‌రాజ్‌లు ఒక ముఠాగా ఏర్పడ్డారు. మధ్యప్రదేశ్ బోపాల్ నుంచి మద్యం కొనుగోలు చేసి నగరానికి తెచ్చి విక్రయిస్తున్నారని తెలిపారు. ఇదే క్రమంలో ఈనెల 27వ తేదిన ఉప్పల్ స్టేడియం మెట్రో స్టేషన్ వద్ద ద్విచక్ర వాహనంపై మద్యం పెట్టుకుని ఉండగా పోలీసులు అనుమానం వచ్చి ప్రశ్నించగా నిందితుల వివరాలు వెల్లడైనట్లు తెలిపారు. వీరి వద్ద నుంచి వివిధ బ్రాండ్‌లకు చెందిన మద్యం సీసాలతోపాటు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

## వచ్చేనెల 19న వినాయక చవితి, 28న నిమజ్జనం

### భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి

హైదరాబాద్, ఆగస్టు 28, ప్రభాతవార్త: ఈ ఏడాది వినాయక చవితి ఉతసవాలపై భాగ్యనగర్ ఉత్సవ సమితి కీలక ప్రకటన చేసింది. వచ్చే నెల 19వ తేదీన సాంప్రదాయబద్ధంగా వినాయక చవితి పండుగ నిర్వహించుకోవాలని సూచించింది. అలాగే 28వ తేదీన నిమజ్జనం ఉంటుందని స్పష్టం చేసింది. సోమవారం భాగ్యనగర్ ఉత్సవ సమితి సభ్యులు సమావేశమై గణేష్ ఉత్సవ ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఏడాది వినాయక చవితి ఏ రోజున జరుపుకోవాలనే సందేహం చాలా మందిలో ఉంది. అయితే ఈనెల 18వ తేదీన మధ్యాహ్నం చవితి మొదలై 19వ తేదీన మధ్యాహ్నం వరకు ఉంటుంది. సూర్యోదయం తర్వాత వచ్చిన తిథినే పండుగ రోజుగా గుర్తిస్తాం. కాబట్టి 19వ తేదీన సాంప్రదాయబద్ధంగా వినాయక చవితి జరుపుతున్నాం. ఆదే నెల 28వ తేదీన నిమజ్జనం కార్యక్రమం ఉంటుందని స్పష్టం చేశారు.

## గణేష్ నవరాత్రి మహోత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు

### సమీక్షించిన మంత్రులు తలసాని, మహమూద్ ఆలీ



సోమవారం ఎంసిహెచ్‌ఆర్‌డిలో గణేష్ నవరాత్రోత్సవాల నిర్వహణపై మాట్లాడుతున్న మంత్రులు మహమూద్‌అలీ, శ్రీనివాస్‌యాదవ్, నగర మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలతా శోభన్‌రెడ్డి

చిక్కడపల్లి, ఆగస్టు 28 ప్రభాతవార్త: వచ్చే నెలలో నిర్వహించే గణేష్ నవరాత్రి మహోత్సవాలను ఘనంగా నిర్వహించే విధంగా ప్రభుత్వం సిఎం కెసిఆర్ నాయకత్వంలో అన్ని ఏర్పాట్లు చేయడం జరుగుతోందని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫి శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సోమవారం ఎంసిహెచ్‌ఆర్‌డిలో గణేష్ నవరాత్రోత్సవాల నిర్వహణ, ఏర్పాట్లపై రాష్ట్ర హోంమంత్రి మహమూద్ ఆలీ, మంత్రి మల్లారెడ్డిలతో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. నగరమేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతరెడ్డి, ఎమ్మెల్సీలు ప్రభాకరరావు, సురభివాణిదేవి, ఎమ్మెల్యే దానం నాగేందర్, ఆర్థిక శాఖ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావు, అదనపు డీజీ(లా అండ్ ఆర్డర్) సంజయ్ జైన్, ఆరోగ్య శాఖ అదనపు డైరెక్టర్ అమర్‌సింగ్, జిహెచ్‌ఎంసి కమిషనర్ రోనాల్డ్ రోస్, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లా కలెక్టర్‌లు అనుదీప్ దురిశెట్టి, హరీష్, అమయ్‌కుమార్, సమాచార శాఖ కమిషనర్ అశోక్‌రెడ్డి, నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ ధర్మా, హైదరాబాద్, సైబరాబాద్ పోలీసు కమిషనర్‌లు సీవీ.ఆనంద్, స్టీఫెన్ రవీంద్ర, భాగ్యనగర్ ఉత్సవ సమితి కార్యదర్శి భగవంతరావు, బాలాపూర్, ఖైరతాబాద్, సికింద్రాబాద్ వైఎంసిఏ గణేష్ ఉత్సవ కమిటీలతో పాటు వివిధ గణేష్ మండపాల కమిటీ సభ్యులు రామరాజు ప్రభాకర్, సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు. జిహెచ్‌ఎంసి పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ పరిధిలో నిర్వహించే ఉత్సవాలకు దేశంలోనే హైదరాబాద్‌కు ప్రత్యేక గుర్తింపు ఉందని, ప్రధానంగా ఖైతరాబాద్‌లో నిర్వహించే అతిపెద్ద విగ్రహ నిమజ్జనాన్ని లక్షలాది మంది ప్రత్యేకంగా వీక్షిస్తారని, బాలాపూర్ వినాయకుడి శోభాయాత్ర అనంతరమే మిగతా మండపాల యాత్ర ప్రారంభమవుతూ వస్తోందన్నారు. విద్యుత్తు సరఫరాలో ఎక్కడ కూడా అంతరాయం కలగకుండా ప్రత్యేక విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్లను అందుబాటులో ఉంచడం జరుగుతుందన్నారు. నిమజ్జనం జరిగే ప్రాంతాలు, శోభాయాత్ర నిర్వహించే ప్రాంతాలలో భక్తులకు తాగునీరు అందించేందుకు వాటర్‌వర్క్స్ ఆధ్వర్యంలో ప్రత్యేక కేంద్రాలు, సిబ్బందిని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. చివరి నిమజ్జనం రోజు ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా పర్యవేక్షించడం జరుగుతుందని, ఏర్పాట్ల విషయంలో ఉత్సవాల నిర్వాహకులు సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు.

## హామీల అమలులో బిఆర్‌ఎస్ విఫలం


### గుల్బర్గా ఎమ్మెల్సీ శశిష్ నమోషీ



సమావేశంలో మాట్లాడుతున్న గుల్బర్గా ఎమ్మెల్సీ శశిష్ నమోషీ, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

ఫిల్మ్‌నగర్, ఆగస్ట్ 28, ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తరువాత ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోలేదని గుల్బర్గా ఎమ్మెల్సీ శశిష్ నమోషీ ధ్వజమెత్తారు. డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇచ్చిందిలేదని, దళితులకు 3ఎకరాలు భూమి ఇవ్వలేదని ఆరోపించారు. భార తీయ జనతా పార్టీ చేపట్టిన ప్రవాస్ యోజన కార్యక్రమంలో భాగంగా ఖైరతాబాద్ నియోజకవర్గంలో భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో గత ఎనిమిది రోజులుగా శశిష్ నమోషీ పర్యటించారు. అనంతరం బంజారాహిల్స్‌లోని ఆనంద్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో శశిష్ నమోషీ మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్ గెలిచిన నాలుగేళ్లలో ప్రజలకు అందుబాటులో లేకుండా ఎన్నికలకు 6నెలల ముందు ఎస్సీ బంధు, బిసిబంధు, గృహలక్ష్మీలాంటి ప్రభుత్వ పథకాల పేరుతో మళ్ళీ మోసం చేయడానికి ప్రజలముందుకు వస్తున్నారని ఆరోపించారు. గత నాలుగేళ్లలో దానం ఖైరతాబాద్ నియోజకవర్గంలోని ఆరు డివిజన్‌లలో చేపట్టిన అభివృద్ధి పనులపై శ్వేతపత్రం విడుదల చేయాలని శశిష్ నమోషీ డిమాండ్ చేశారు. రేకుల రూములలో నివాసముండే బీదవారికి 5లక్షల రూపాయలు నిధులు ఇస్తామని మాయ మాటాలు చెప్పి ఎమ్మెల్యేగా గెలిచిన దానం మరొకసారి ఖైరతాబాద్ నియోజకవర్గంలో ప్రజలను మోసం చేయటానికి మళ్ళీ వస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎన్.ప్రేమ్‌రాజ్, మేచినేని శ్రీనివాస్‌రావు, నియోజకవర్గం కన్వీనర్ గద్దె వెంకట్‌స్వామి, జిల్లా నాయకులు బంగారం చంద్రశేఖర్, శ్రవణ్ యాదవ్, రాఘవరెడ్డి, పార్టీ పదాధికారులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్న 200 మంది మైనార్టీలు



బిఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్న మైనార్టిలతో ఎమ్మెల్యే కాలేరు

హైదరాబాద్, ఆగస్టు 28 ప్రభాతవార్త: అంబర్‌పేట ప్రేమ్ నగర్‌లో బిఆర్‌ఎస్ సీనియర్ నాయకులు కె.రాజగోపాల్ నాయుడు ఆధ్వర్యంలో న్యాయవాది షౌకత్‌ఆలీతోపాటు వారి మిత్ర బృందం సుమారు 200 మంది ముఖ్యనాయకులు సోమవారం అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సమక్షంలో బిఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకోవడం జరిగింది. బంగారు తెలంగాణలో భాగంగా సిఎం కెసిఆర్ రాష్ట్రంలో ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు నచ్చి అలాగే కాలేరు వెంకటేష్ పనితీరుకు మెచ్చి స్వచ్ఛందంగా 200 మందికిపైగా మైనార్టి సోదరులు కుటుంబ సభ్యులతో బిఆర్‌ఎస్‌పార్టీలో చేరడం జరిగింది. ఈ సందర్భంగా కాలేరు వెంకటేష్ మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా మైనారిటీలకు తీరని కలలను కెసిఆర్ అమలు చేస్తున్నారని, తాను గ్రేవ్ యార్డుకు మూడు ఎకరాల స్థలాన్ని కేటాయించడం జరిగిందని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో మైనార్టిల ఓటింగ్ శాతాన్ని పెంచడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెహమాన్, నసీరుద్దీన్, హబీబ్, రషీద్, అయ్యుబ్, ఖలీల్, నిజాం, అసద్, ఇసాక్, ఆలీ, అస్లాం, గౌస్, కరీం పాల్గొన్నారు.

## పేదలకు సంక్షేమమే పరమవాధి

**ఎమ్మెల్యే దానం నాగేందర్**

ఖైరతాబాద్, ఆగస్టు 28 ప్రభాతవార్త: పేదలకు అండగా ఉంటూ ప్రభుత్వం ప్రజల సంక్షేమమే పరమవాది అని మాజీమంత్రి. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పేర్కొన్నారు. ఖైరతాబాద్ తన నియోజక ప్రాంతం అయిన పలు బస్తీల, కాలనీలలో పర్యటిస్తూ పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. స్థానికంగా ప్రధాన సమస్యలైన వాటిపై దానం దృష్టికేంద్రీకరించారు. రోడ్లు, మంచినీరు, విద్యుత్, వీధిదీపాలు, తదితర వంటి వాటిపై నాగేందర్ ఫోకస్ పెట్టారు. చిన్న సమస్యలు స్వయంగా ఆయన దృష్టికి వచ్చిన వెనువెంటనే సంబంధిత శాఖ అధికారులతో చర్చించి సమస్యలను పరిస్తాన న్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే

**ఖైరతాబాద్ కార్పొరేటర్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి పి.విజయారెడ్డి**

ఖైరతాబాద్, ఆగస్టు 28 ప్రభాతవార్త: అన్ని రంగాలలో స్థానికంగా ప్రజలకు కాంగ్రెస్ అండగా నిలుస్తుందని రాబోయేది తమ ప్రభుత్వమేనని ఖైరతాబాద్ కార్పొరేటర్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి పి.విజయారెడ్డి చెబుతున్నారు. ఆమె నియోజక వర్గం స్థాయిలోని బస్తీల, కాలనీలలో పర్యటిస్తూ కాంగ్రెస్ భవిష్యత్తులో చేపట్టబోయేది సూచిస్తున్నారు. 'హాత్ సే హాత్' అంటూ సోనియాగాంధీ, రాహుల్ గాంధీలను స్థానికంగా ప్రజలకు వివరిస్తున్నారు. విజయారెడ్డి వెంట అధికశాతం మహిళలే ఉంటడం కొంత ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది.

## పాఠశాలలో గ్రీన్ కలర్ డే



ఆకుపచ్చ వర్ణంలోని వివిధ ఆకృతిలో విద్యార్థులు

జీడిమెట్ల, ఆగస్టు 28 ప్రభాతవార్త : సుభాష్‌నగర్ డివిజన్ పరిధిలోని టివిఆర్ మోడల్ హైస్కూల్లో సోమవారం గ్రీన్ కలర్ డే నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు ఆకుపచ్చ వర్ణంలోని వివిధ ఆకృతిలో ముస్తాబై సందడి చేశారు. మేనేజింగ్ డైరెక్టర్ వంశీకృష్ణరెడ్డి మాట్లాడుతూ ఆకుపచ్చ రంగు ప్రకృతికి ప్రతీక అన్నారు. పచ్చధనంతో తుళతూగే పైరులు, అడవిలో మానవాళితో పాటు సమస్త జీవరాసులు పులకించిపోత యాన్నారు. కార్యక్రమంలో చైర్మన్ కోటిరెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ రవిచంద్రారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

**నిజాంపేట నగరపాలక సంస్థ మేయర్ నీలారెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ నీలారెడ్డి

నిజాంపేట, ఆగస్టు 28 ప్రభాతవార్త : అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని నిజాంపేట నగరపాలక సంస్థ మేయర్ నీలారెడ్డి పేర్కొన్నారు. సోమవారం కార్పొరేటర్లు, వివిధ విభాగాల అధికారులతో ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా నిజాంపేట కమాన్ నుండి బాచుపల్లి వరకు రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా చేపట్టవలసిన చర్యలపై చర్చించారు. అనంతరం మేయర్ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. ఆయా డివిజన్లలో అసంపూర్తిగా ఉన్న పనులను త్వరితంగా పూర్తి చేయాలని సంబంధిత విభాగాలను ఆదేశించారు. కార్యక్రమంలో కమీషనర్ రామక్రిష్ణరావు, కార్పొరేటర్లు, విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## ప్రమాణ స్వీకారోత్సవానికి ఆహ్వానం



మేయర్ గద్వాల్ విజయలక్ష్మికి పుష్పగుచ్చం అందిస్తున్న సగర సంఘం

మెహిదీపట్నం, ఆగస్టు 28, ప్రభాతవార్త : కార్వాన్ సగర సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని సెప్టెంబర్ 3న కార్వాన్‌లో ఘనంగా నిర్వహించడం జరుగుతుందని ఆ సంఘం నూతన అధ్యక్షులు కోడూరు శ్రీధర్‌సాగర్ తెలిపారు. సోమవారం జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు కోడూరు శ్రీధర్‌సాగర్ మాట్లాడుతూ.. సగర కులస్తుల అభివృద్ధికోసం సఘం సభ్యులు నిరంతరం కృషి చేయడం జరుగుతుందన్నారు. మేయర్‌ను కలిసిన వారిలో బలరాం సాగర్, సంద వెంకటేష్, అంబటి అనీల్, పురుడు శ్రీకాంత్, రాజేశ్వర్ సాగర్, నర్సింగ్ సాగర్‌లు ఉన్నారు.

## ముదిరాజ్ మహాధర్నా విజయవంతం చేయాలి

**చిన్నంగి వెంకటేశం**



సమావేశానికి హాజరైన ముదిరాజ్ నాయకులు

దుండిగల్, ఆగస్టు 28 ప్రభాతవార్త: ముదిరాజ్‌లకు జరుగుతున్న అవమానాలు, అన్యాయాలకు నిరసనగా మంగళవారం ఉదయం 9గంలకు గండిమైసమ్మ చౌరస్తాలో జరిగే మహాధర్నాకు ముదిరాజ్ బిడ్డలు పెద్ద ఎత్తున తరలి రావాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర నాయకులు చిన్నంగి వెంకటేశం పిలుపునిచ్చారు. ఈమేరకు సోమవారం గండిమైసమ్మలో కొరివి రాముముదిరాజ్ ఆధ్వర్యంలో ముఖ్య నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 60లక్షల మంది ఓటర్లు ఉన్న ముదిరాజ్‌లకు ఒక్క ఎమ్మెల్యే టికెట్ కేటాయించకపోవడం దారుణమన్నారు. ముదిరాజ్‌లకు అన్యాయం చేస్తే సహించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయులు, సాయిప్రతాప్, సుగ్రీవుడు, సత్యనారాయణ, సాయిబాబా, బాలరాజు, మల్లేష్, యాదగిరి, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

## పేద ప్రజలకు సిఎం రిలీఫ్ ఫండ్ ఎంతో మేలు : లాస్య నందిత



మెరుగైన వైద్యానికి సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న కంటోన్మెంట్ బిఆర్ఎస్ అభ్యర్థి లాస్య నందిత

కంటోన్మెంట్, ఆగస్టు 28 ప్రభాతవార్త: పేదప్రజల సంక్షేమం కోసం ముఖ్య మంత్రి కేసిఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేకొని ప్రయోజనం పొం దాలని కంటోన్మెంట్ నియోజకవర్గం బిఆర్ఎస్ అభ్యర్థి లాస్య నందిత తెలిపారు. 5వ వార్డు కాకగూడ బాలాజీ కాలనీలో నివాసం ఉంటున్న కిష్టయ్య అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ప్రముఖ సామాజిక కార్యకర్త తేలుకుంట సతీష్ గుప్త సహకారంతో దివంగత ఎమ్మెల్యే సాయన్నను సంప్రదించారు. దాంతో ముఖ్య మంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.37 వేల చెక్కును సోమవారం లాస్య నందిత చేతుల మీదుగా అందజేశారు. కుటుంబ సభ్యులు లాస్య నందితకు, సహకరించిన తేలుకుంట సతీష్ గుప్తకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు సదానంద్ గౌడ్, మధు ముదిరాజ్, మహేశ్, ఉమా శంకర్, నిత్యానంద్ పాల్గొన్నారు.

## మరింత పారదర్శకంగా ప్రభుత్వ పాఠశాలల పనితీరు

**కుత్బుల్లాపూర్ శాసనసభ్యులు కె.పి.వివేకానంద్**



కుత్బుల్లాపూర్ డివిజన్ దత్తాత్రేయనగర్‌లో గ్లాండ్‌ఫార్మా లిమిటెడ్ సౌజన్యంతో రూ.లురెండు కోట్ల వ్యయంతో నిర్మించిన ప్రభుత్వపాఠశాల అభివృద్ధి పూర్తయిన సందర్భంగా ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్, మాజీ కార్పొరేటర్లు కె.ఎం.గౌరీష్, బొడ్డు వెంకటేశ్వరరావు, స్వామి వడ్ల, దేవరకొండ శ్రీనివాస్

కుత్బుల్లాపూర్, ఆగస్టు 28 ప్రభాతవార్త : విద్యార్థులు లక్షసాధన దిశగా నిరంతరం శ్రమిస్తేనే ఉత్తమ ఫలితాలు సాధ్యమని కుత్బుల్లాపూర్ శాసన సభ్యులు కె.పి.వివేకానంద్ అన్నారు. జీడిమెట్ల గ్లాండ్ ఫార్మా లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలోని దత్తాత్రేనగర్‌లో సుమారు రెండు కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన ప్రభుత్వపాఠశాలను ఆయన కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస్, సంక్షేమ సంఘ అధ్యక్షులు స్వామివడ్లతో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా స్థానిక మాజీ కార్పొరేటర్ కె.ఎం.గౌరీష్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. . కార్యక్రమంలో మండల విద్యాధికారి ఆంజనేయులు, ఎంఎల్ఓ జి.రమేష్, మాజీ కార్పొరేటర్ బొడ్డు వెంకటేశ్వరరావు, దత్తత్రేయనగర్ సంక్షేమ సంఘ అధ్యక్షులు స్వామివడ్ల, డివిజన్ టిఆర్ఎస్ అధ్యక్షులు దేవరకొండ శ్రీనివాస్, టిఆర్ఎస్ యువజన అధ్యక్షులు దూదిమెట్ల సోమేశ్‌యాదవ్, సంక్షేమసంఘ ప్రతినిధులు యాదగిరి, అశోక్, గోవిందరాజు, ఉత్తరయ్య, శ్రీనివాస్, మహిళా నాయకులు సరస్వతి, సావిత్రి, జరీనా పాల్గొన్నారు

## చిత్తశుద్ధి పట్టుదల కృషితో ఏలక్ష్యాన్నైనా సాధించవచ్చు

**తెలంగాణ రాష్ట్ర ఆర్థికశాఖ సంయుక్త కార్యదర్శి కె.హారిత**




జాతీయస్థాయి సంగీత నృత్యపోటీ ప్రదర్శనల్లో ఓ దృశ్యం

నాంపల్లి, ఆగస్టు 28 ప్రభాతవార్త : ప్రతీఒక్కరూ ఒక లక్ష్యాన్ని ఏర్పాటుచేసుకొని ఆ లక్ష్యసాధనకు చిత్తశుద్ధి, పట్టుదల, అకుంటితదీక్షతో కృషిచేయాలని తెలంగాణ రాష్ట్ర ఆర్థికశాఖ సంయుక్త కార్యదర్శి కె.హరిత అన్నారు. పనిపట్ల ఇష్టంతో మనస్ఫూర్తిగా చేస్తే జీవితంలో సర్వతోపురోభివృద్ధి సాధించవచ్చని హితవుపలికారు. సారస్వత పరిషత్తులో వారంరోజులపాటు నవ్యనాటక సమితి నిర్వహణలో జరుగుతున్న 48వ అకిలభారత సంగీత నృత్యపోటీల 3వరోజు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కె.హరిత ఈ పోటీల్లో పాల్గొనే యువకళాకారులందరూ క్రీడాస్ఫూర్తితో తమ ప్రతిభను చాటుకోవాలని సూచిస్తూ సంస్థ గత ఆరున్నత దశాబ్దాలుగా చేస్తున్న సాంస్కృతిరంగ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథులుగా పాల్గొన్న జి.వసుంధర, సంస్థ అధ్యక్షుడు వి.విజయకుమార్, సుధామాల, లక్ష్మీమానస, సుధారాణి తదితరులతో కలిసి పలువురు నాట్యగురువులను ఘనంగా సత్కరించారు. ఈనాటి సంగీత నృత్య పోటీల్లో జూనియర్స్, సీనియర్స్ విభాగాల నుండి 35కుపైగా కళాకారులు అద్భుత కూచిపూడి నృత్యప్రదర్శనలతో పోటీపడి ఆహుతులను ఆకట్టుకున్నారు.

## అమిత్ షాను కలిసిన బిజెపి నాయకులు



కేంద్ర హోంశాఖా మంత్రి అమిత్ షాను కలిసిన జిహెచ్ఎంసి కౌన్సిల్ విప్ తోకల శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి, ఆగస్టు 28 ప్రభాతవార్త : కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాను జిహెచ్ఎంసి కౌన్సిల్ విప్, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి కలిశారు. ఖమ్మంలో జరిగిన రైతు గోస-బిజెపి బరోసా బహిరంగ సభకు కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో బిజెపి నాయకులు తరలి వెళ్లారు. బహిరంగ సభలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు ఇచ్చిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించినందుకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అభినందించారని తెలిపారు. బిఆర్ఎస్ ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పనున్నారని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు బిజెపి నాయకులు పాల్గొన్నారు.



రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని సులేమాన్‌నగర్ డివిజన్ బిఆర్ఎస్ మైనార్టీల నాయకులు నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

## స్పోర్ట్స్ స్టూడెంట్స్ ఫెడరేషన్ వాల్ పోస్టర్ ఆవిష్కరణ



ఎస్ఎస్ఎఫ్ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంగటి రాజేష్

తార్నాక, ఆగస్టు 28 ప్రభాతవార్త: విద్యారంగంలో ప్రభుత్వ ఉద్యోగాల్లో స్పోర్ట్స్ కోటాను అమలు చేయాలని స్పోర్ట్స్ స్టూడెంట్స్ ఫెడరేషన్ చీఫ్ అడ్వయిజర్ బిక్కసాని ప్రశాంత్, రాష్ట్ర అధ్యక్షులు సంగటి రాజేష్ పేర్కొన్నారు. స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు 29న హబ్సిగూడలో నిర్వహించబోయే ఆవిర్భావ సభకు సంబంధించి రూపొందించిన వాల్ పోస్టర్‌ను సోమవారం ఓ.యూ ఆర్ట్స్‌కాలేజ్ ఎదుట ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఆవిర్భావ సభకు ఎమ్మెల్సీ కవిత, మంత్రి శ్రీనివాస్ గౌడ్, స్పోర్ట్స్ చైర్మన్ ఆంజనేయ గౌడ్ తధితరులు పాల్గొంటారని చెప్పారు. క్రీడాకారుల హక్కుల కోసం ఏర్పాటు చేసే సభకు క్రీడాకారులు, విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరు కావాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రసిడెంట్ నాగరాజు, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపర్చాలి : కొంతం దీపిక



కుమ్మరిగూడలోని ప్రభుత్వ పాఠశాలలో తనిఖీ చేస్తున్న కార్పొరేటర్ కొంతం దీపిక తదితరులు

కంటోన్మెంట్, ఆగస్టు 28 ప్రభాతవార్త: ప్రభుత్వ పాఠశాలల్లో, అంగన్‌వాడి కేంద్రల్లో విద్యార్థుల చదువులకు ఆటకం జరగకుండా మౌళిక సదుపాయాలు మెరుగుపర్చాలని మోండా డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక తెలిపారు. సోమవారం మోండా డివిజన్‌లోని కుమ్మరిగూడలోని ప్రభుత్వపాఠశాల అంగన్‌వాడి కేంద్రాలను పర్యటించి వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అంగన్‌వాడి కేంద్రానికి వచ్చే చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించేందుకు టీచర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అదే విధంగా పిల్లలకు అర్థమయ్యే రీతిలో విద్యా బోధన చేయాలని సూచించారు.

### పేద విద్యార్థులను స్వచ్ఛంద సంస్థలు ప్రోత్సహించాలి : శ్రీదేవి

అడ్డగుట్ట, ఆగస్టు 28 ప్రభాతవార్త: ప్రభుత్వ పాఠశాలలు జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు ఉన్నత చదువులు చదివేందుకు స్వచ్ఛంద సంస్థలు తగిన ప్రోత్సాహాన్ని అందించేందుకు ముందుకు రావాలని జూబ్లీ హిల్స్ రోటరీ క్లబ్ చారిటబుల్‌ట్రస్ట్ డైరెక్టర్ కొల్లూరి శ్రీదేవి తెలిపారు. సోమవారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో చదువుతున్న వంద మంది విద్యార్థినీలకు ఉచితంగా రోటరీ క్లబర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు రిజ్వాన్, హన్మంత్ రెడ్డి, కుమార స్వామి, మురళీ క్రిష్ణ, అభిషేక్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి అధ్యక్షతన జరిగింది.

## ప్రభుత్వ స్థలంలో కోర్టు తీర్పు ప్రకారం అక్రమ నిర్మాణం అపాలి

సైఫాబాద్, ఆగస్టు 28 ప్రభాతవార్త: కోర్టు తీర్పు ప్రకారం ప్రభుత్వ స్థలంలో అక్రమంగా చేపడుతున్న నిర్మాణాలను వెంటనే నిలిపివేయాలని బాధిత కుటుంబ సభ్యులు రాష్ట్ర సిఎం కెసిఆర్, మున్సిపల్ శాఖ మంత్రి కెటిఆర్, జిహెచ్ఎంసి కమీషనర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బేగం బజార్‌కు చెందిన సునీల్‌శర్మ, సరోజ్‌శర్మ, జ్యోతిశర్మ మాట్లాడుతూ 13 సంవత్సరాల క్రితం బేగంబజార్‌లోని జెన్సీ చోరైల్‌లో తాము నిర్మించుకున్న ఇంటిపక్కనే ఉన్న 23 గజాల ప్రభుత్వ స్థలాన్ని సమీప వ్యక్తి అక్రమించుకుని తమ ఇంటికి వెంటిలేషన్, గాలీ రాకుండా నిర్మాణం చేపట్టారని ఆరోపించారు. ఈ విషయంపై పలుమార్లు మున్సిపల్ అధికారులకు, జిహెచ్ఎంసి కమీషనర్, పోలీసు ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేసినా పట్టించకోలేదన్నారు. చివరికి ఇంటి నిర్మాణం అపాలని జూనియర్ సివిల్ కోర్టు ఇచ్చిన ఆదేశాలను సైతం లెక్కచేయకుండా అతను ఇంటి నిర్మాణం చేస్తున్నారని, ఈ విషయాన్ని జిహెచ్ఎంసి అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తమ కుటుంబం గాలీ, వెలుతురు లేకుండా ఉక్కపోతతో జీవనం గడుపుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. కెసిఆర్, కెటిఆర్ తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## విద్యుత్ అమర వీరులకు నివాళ్లు అర్పించిన కాంగ్రెస్ పార్టీ



అమరవీరుల స్థూపం నివాళులు అర్పిస్తున్న మందడి అంజన్‌కుమార్‌యాదవ్, కత్తి వెంకటస్వామి తదితరులు

సైఫాబాద్, ఆగస్టు 28 ప్రభాతవార్త: విద్యుత్ ఉద్యమంలో అమరులైన వారికి సోమవారం బషీర్‌బాగ్‌లో అమర వీరుల స్థూపం వద్ద కాంగ్రెస్ పార్టీ నేతలు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా టి-పిసిసి కార్యనిర్వాహక అధ్యక్షుడు మందడి అంజన్ కుమార్‌యాదవ్ మాట్లాడుతూ 2000 సంవత్సరంలో నాటి తెలుగుదేశం ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు ఆదేశాలతో విపరీతంగా విద్యుత్ చార్జీలు పెంచడం జరిగిందనా న్నరు. చార్జీలు పెంపుదలకు వ్యతిరేకంగా నాడు కాంగ్రెస్ పార్టీ, వామపక్షాలు పెద్ద ఎతు_న ఉద్యమం చేపట్టడం జరిగిందని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ ఉద్యమంలో పోలీసులు కాల్పులలో అన్యాయంగా ముగ్గురు అమరులైనారని ఆందోళన వ్యక్తం చేశారు. నాటి నుంచి ప్రతి ఏడాది కా ంగ్రెస్ పార్టీ అమరులకు నివాళులు అర్పిస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రోహిన్‌రెడ్డి, కత్తి వెంకటస్వామి, కుమార్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారానికి చర్యలు: మంత్రి తలసాని



చుట్టల బస్తీలో పర్యటిస్తున్న మంత్రి తలసాని

బేగంపేట ఆగస్టు 28, ప్రభాతవార్త : తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే విధంగా చర్యలు చేపట్టనున్నట్లు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలియజేసారు. సోమవారం రాంగోపాల్‌పేట డివిజన్‌లోని చుట్టల బస్తీలో మంత్రి శ్రీనివాస్ యాదవ్ వివిధ శాఖల అధికారులతో కల్సి పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెల్సుకున్నారు. ప్రధానంగా తమ బస్తీలో తాగునీటి సరఫరా సక్రమంగా జరగడం లేదని సమస్యను పరిష్కరించాలని స్థానికులు మంత్రి ని కోరారు. అదనపు పైప్‌లైన్ ను ఏర్పాటు చేసి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని, వారం రోజులలో అదనపు పైప్‌లైన్ ఏర్పాటు పనులను ప్రారంభిస్తామని ప్రకటించారు. అదే విధంగా బస్తీలో సీవరేజ్ లీకేజీ సమస్య పరిష్కరించాలని కోరగా, పూర్తి స్థాయిలో డీసిల్టింగ్ చేయాల్సి ఉందని అధికారులు మంత్రికి వివరించగా అవసరమైన నిధులు వెంటనే మంజూరు చేస్తున్నామని పనులు ప్రారంభించాలని అదికారులను మంత్రి ఆదేశించారు. మంత్రి వెంట మాజీ కార్పొరేటర్ అత్తెల్లి అరుణా శ్రీనివాస్‌గౌడ్, జోనల్ కమీషనర్ రవికిరణ్, ఆర్డీవో రవి, డీసీ శంకర్, ఈఈ సుదర్శన్, టౌన్ ప్లానింగ్ ఏసీపీ క్రిష్టోఫర్, ఎలక్ట్రికల్ ఏడీఈ కృష్ణ, వాటర్ వర్క్స్ జీఎం సురేష్, బస్తీ అద్యక్షుడు శ్రీనివాస్, జనరల్ సెక్రటరీ రాకేష్, తదితరులు ఉన్నారు.

## తెలుగు భాష మధురమైనది సుసంపన్నమైనది

**ఆచార్య సాగి కమలాకర శర్మ**



మాట్లాడుతున్న ఆచార్య సాగి కమలాకర శర్మ

తార్నాక, ఆగస్టు 28 ప్రభాతవార్త: తెలుగు భాష మధురమైనది... సుసంపన్నమైనదని దానిని ముందు రతాలకు అందించాల్సిన భాద్యత మనందరిపై ఉందని ఆచార్య సాగి కమలాకర శర్మ పేర్కొన్నారు. తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని సామవారం నారాయణగూడలోని కేశవ మెమోరియల్ డిగ్రీ కళాశాలలో ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమలాకర శర్మ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ వేమన సుమతి శతక పద్యాలు మనిషిని ఉన్నతంగా తీర్చిదిద్దుతాయన్నారు. విశ్వనాథ సత్యనారాయణ తదితరుల రచనలను ఉదహరిస్తూ విద్యార్థులల్లో తెలుగు పట్ల శ్రద్ధాశక్తులను పెంపొందించేందుకు ప్రయత్నించారు. గౌరవ అతిథులుగా పాల్గొన్న కోటం రాజు చంద్రశేఖర రావు ప్రసంగిస్తూ సురవరం ప్రతాప్ రెడ్డి, విశ్వనాథ సత్యనారాయణ, శ్రీశ్రీ తదితరుల రచనలను రాగయుక్తంగా పాడి విధ్యార్థులను ఆలరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సోమేశ్వర రావు, కేశవ్ మెమోరియల్ విద్యాసంస్థల కార్యదర్శి సుబ్రహ్మణ్యం, డా. కోట లక్ష్మి, అన్నపూర్ణ, న్యాయ నిర్ణేత శివప్రసాద్, డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకురాలు ఊటుకూరి కాళింది తధితరులు పాల్గొన్నారు. ఈ ఉత్సవాలను పూర్తిగా విధ్యార్థులే నిర్వహించడం ప్రశంసనీయం అన్నారు. ఈ సందర్భంగా కళాశాల తెలుబు విభాగం నిర్వహించిన పోటీలల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

## ఆహ్లాదకరమైన వాతావరణంను అందించేందుకు పార్కుల అభివృద్ధి



బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ లోని పంచతంత్ర పార్కులో మొక్కలను పరిశీలిస్తున్న మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్

నార్సింగి, ఆగస్టు 28 ప్రభాతవార్త : ప్రజలకు అహ్లాదకరమైన వాతావరణంను అందించేందుకు బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్‌లో పెద్ద ఎత్తున పార్కులను అభివృద్ధి చేస్తున్నామని మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్ పేర్కొన్నారు. సోమవారం కార్పొరేషన్ పరిధిలోని 19.వ, వార్డులో ఉన్న పంచతంత్ర పార్కులో అందమైన పూల మొక్కలు, ఔషద మొక్కలు, పచ్చటి గడ్డి, వాకింగ్ ట్రాక్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మహేందర్‌గౌడ్ మాట్లాడుతూ యాంత్రిక జీవనానికి అలవాటు పడ్డ ప్రజలు ఆరోగ్యంను అశ్రద్ధ చేస్తూ అనారోగ్యం పాలువుతున్నారన్నారు. ప్రతీ ఒక్కరూ సూర్యోదయానికి ముందే కాలకృత్యాలు తీర్చుకొని, వాకింగ్, యోగ, ఆసనాలు, ప్రాణాయామం వంటివి ప్రతి రోజూ క్రమం తప్పకుండా చేయాలన్నారు. సంపాదించిన డబ్బుతో ఆనందమయమైన జీవితంను గడుపాలంటే ఆరోగ్యంను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆదాయార్జనకు రోజులో 12.గంటల పాటు కష్టపడుతున్నారని, ఆరోగ్య సంపాదన కోసం రోజులో కనీసం గంట సమయమైన కేటాయించాలని మేయర్ సూచించారు. వృద్దులు, పిల్లలు, యువత అందరికి ఉపయోగపడేలా పార్కులను తీర్చిదిద్దుతున్నామన్నారు. వృద్ధులకు వాకింగ్ ట్రాక్‌లు, పిల్లలకు ఆట వస్తువులు, యువతకు ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేశామని వివరించారు. ఇంకా అవసరమైన ప్రాంతాలలో పార్కులను అభివృద్ధి చేస్తామని తెలిపారు. అలాగే జల మండలి జీఎం రవీందర్‌రెడ్డి, హెచ్ఎండిఏ ఏఈ ముక్రం అలీలతో కలిసి ఏడో వార్డులో మేయర్ పర్యటించారు.

## బాబాషైలాని నగర్‌లో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

యూసుఫ్‌గూడ, ఆగస్టు 28, ప్రభాతవార్త : ప్రజా అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఎప్పటికపుడు నిధులు కేటాయించి అభివృద్ధి పనులు జరుగుతుందని బిఆర్ఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు, జూబ్లిహిల్స్ శాసన సభ్యులు మాగంటి గోపినాధ్ అన్నారు. సోమవారం బోరబండ బాబాషైలాని నగర్ బస్తీలో రూ.19లక్షల వ్యయంతో శివరేజ్ పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేశారు. అంతకు ముందు బస్తీలో పాదయాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తిచేసేలా అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు కృష్ణమోహన్, కోఆర్డినేటర్ విజయ్‌సింహా, ఇన్‌చార్జ్ సిరాజ్, షరీఫ్, కురమయ్య, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

## బీసీలకు సీట్ల కేటాయింపులో న్యాయం చేయండి

సికింద్రాబాద్, ఆగస్టు 28 ప్రభాతవార్త : దళిత సంఘర్షణ సమితి (డీఎస్ఎస్) రాష్ట్ర ప్రధాన కార్యాదర్శి నిరుడు కృష్ణ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలో నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, దళిత బంధు కిందిస్థాయిలో అందరికి అందేలా చూడాలని కోరారు. అలాగే ఎమ్మెల్యే అభ్యర్థుల టికెట్ కేటాయింపులో మార్పులు జరిపి బీసీలకు 50శాతం సీట్లు కేటాయిం చాలని, ఎసీ, ఎస్టీలకు జనరల్ స్థానాల్లో సీట్లు కేటాయించాలని వినతిపత్రం సమర్పించి నట్లు నిరుడు కృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో మనోజ్, రమేష్, వెంకటేష్, అశోక్ బగుల్ తదితరులు పాల్గొన్నారు.

## జూపార్కు కొత్తగా క్యూరేటర్‌గా డాక్టర్ సునీల్ ఎస్ హీరామత్



జూపార్కు డైరెక్టర్ .ఎస్.ఎన్.వి.ప్రసాద్‌ను కలిసిన జూపార్కు కొత్త క్యూరేటర్ డాక్టర్.సునీల్ ఎస్.హీరామత్

చార్మినార్, ఆగస్టు 28 ప్రభాతవార్త : హైదరాబాద్ పాతబస్తీ బహదూర్‌పుర శివారంలో ఉన్న నెహ్రూ జూలాజికల్ పార్కు క్యూరేటర్‌గా డాక్టర్.సునీల్ ఎస్.హీరామత్ నియమితులయ్యారు. దాదాపు ఆరు నెలలు పాటు జూపార్కు క్యూరేటర్‌గా విధులుగా నిర్వహించిన ప్రశాంత్ బాజీరావు పాటిల్ అదిలాబాద్ జిల్లా ఫారెస్ట్ అధికారిగా బదిలీ అయ్యారు. నిర్మల్ జిల్లా ఫారెస్ట్ అధికారిగా విధులు నిర్వహించిన డాక్టర్.సునీల్ ఎస్.హీరామత్ జూపార్కు క్యూరేటర్‌గా బదిలీపై వచ్చారు. జూపార్కు నూతన క్యూరేటర్ సోమవారం జూపార్కు డైరెక్టర్ వి.ఎస్.ఎన్.వి.ప్రసాద్‌ను కలిశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జూపార్కు అభివృద్ధి కోసం శాయ శక్తుల కృషి చేస్తానని తెలిపారు. జూపార్కు అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది జూపార్కు కొత్తగా క్యూరేటర్ డా.సునీల్ ఎస్.హీరామత్‌ను కలిసి అభినందనలు తెలిపారు.

**IN THE COURT OF HON'BLE V SENIOR CIVIL JUDGE CITY CIVIL COURT AT: HYDERABAD**
**O.S. No. 115 OF 2018**

**Between:**
**M/s MAINA ASSOCIATES,** rep. by Mr. V Kamlesh parakh, S/o Vijay Raj Parakh, Aged 40 years, Office at # 1-2-338/A/1, 2nd floor Maina Chambers, Street No.6, Domalguda, Hyderabad.
**.... Plaintiff**

**A N D**

1. G. Vinay Naidu, S/o G. Jagannadham Aged 34 years, Occ: Business, R/o: F.No.502, NMR Diya Residency, Vinayak Nagar, Hafeezpet, Miyapur, Near Bharat Petrol Pump, Hyderabad-500049.
2. Aita Vijaya Lakshmi, D/o Aita Venkaiah Naidu, Aged about: 38 years, Occ: (Govt Employee working Secretariat), R/o: # 1-2-382, F.No.201, Above Dena Bank, Domalguda, Hyderabad,
**...Defendants**

To
G. Vinay Naidu, S/o G. Jagannadham, Aged 34 years, Occ: Business, R/o: F.No.502, NMR Diya Residency, Vinayak Nagar, Hafeezpet, Miyapur, Near Bharat Petrol Pump, Hyderabad-500049. **(Def No.1)**
Aita Vijaya Lakshmi, D/o Aita Venkaiah Naidu, Aged about: 38 years, Occ: (Govt Employee working Secretariat), R/o: # 1-2-382, F.No.201, Above Dena Bank, Domalguda, Hyderabad. **(Def No.2)**

WHEREAS, the above named Plaintiff has filed the above suit against you for Recovery of Rs. 9,41,187/- (Rupees Nine Lakhs forty one thousand one eighty seven only) with future interest and costs.

Take Notice that, the above suit stands posted to 31-08-2023 for your appearance in the said Court at 10.30 A.M. If you fail to appear in the above said Court either in person or through Advocate, the suit will be heard and decided Ex-parte.

**// BY ORDER OF THE COURT//**
**Sri. S.SRIKANTH and M.JITENDER REDDY Advocates,**
Flat No. 201 , C Block, Siddamshetty apartment
Gandhi Nagar, Hyderabad -500020.
**9848060546, 8008446206**
**COUNSEL FOR THE PLAINTIFF**

**IN THE COURT OF THE HON'BLE II ADDITIONAL DISTRICT JUDGE, RANGA REDDY DISTRICT, AT: L.B. NAGAR**
**IA NO. 290 of 2021**
**In**
**O.S.NO. 181 OF 2021**

BETWEEN:
**TALLA NARESH KUMAR GOUD**
**And another**
**...PETTIONERS/PLAINTIFFS**
AND
**TALLA SURENDER GOUD**
**And others**
**...RESPONDENTS/DEFENDANTS**

To
**D-10 MURIEL SEQURA,**
W/o Lulo Kantipudi Sekhar,
Aged: Major, Occ: Housewife,
R/o Gudur Village, Kandukur Mandal, Ranga Reddy District.
**D-11 SRIDEVI SHILPA KAUDULA,**
W/o Srinivas Kaudula,
Aged: Major, Occ: Housewife,
R/o Gudur Village, Kandukur Mandal, Ranga Reddy District.

**NOTICE**

The Plaintiff herein had filed the above suit for Partition and Separate Possession and to Declare the Registered A.G.P.A. Dated 15.09.2005 bearing No.6937/2005 as null and void against the Defendants which includes you. The Hon'ble Court was pleased to order for publication of this notice for your appearance in the above suit and the matter is posted to **14.09.2023 at 10.30 a.m.** and therefore you may appear before this Hon'ble Court either personally or through your authorized counsel or otherwise the matter will be adjudicated in due process of Law. Hence, this Notice.

[BY ORDER OF THE COURT]
**Sd/- N. VENKAN GOUD,**
**Advocate**
Plot No.133, Ananthula Janga Reddy Colony, Mamatha Nagar, GSI, L.B.Nagar, Ranga Reddy District.

## మార్కెట్ అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే బలాల



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బలాల తదితరులు

**మలక్‌పేట, ఆగస్టు 28 ప్రభాతవార్త :** మలక్‌పేటలోని మహబూబ్ మాన్షన్ మార్కెట్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని బలాల పేర్కొన్నారు. మలక్‌పేట, మార్కెట్ ఆవరణలో రూ.52లక్షలతో నూతనంగా నిర్మించనున్న డ్రైనేజ్ పైప్‌లైన్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే బలాల, చైర్‌పర్సన్ అనితానాయక్, వైస్‌చైర్మన్ భూమేష్, పాలకవర్గ సభ్యులు, వ్యాపారస్తులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మార్కెట్‌లో డ్రైనేజీ సమస్య పరిష్కారంకోసం నూతన డ్రైనేజ్ పైప్‌లైన్ నిర్మాణ పనులను చేపడుతున్నామని తెలిపారు. మార్కెట్లో రైతులు, వ్యాపారులు, ప్రజలకు మౌలిక సదుపాయాలుకల్పించి మార్కెట్ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. అనంతరం అనితా నాయక్ మాట్లాడుతూ ఎమ్మెల్యే నిధుల నుండి 32 లక్షలు, మార్కెట్ నిధుల నుండి 20లక్షలు మొత్తం 52లక్షలతో డ్రైనేజీ నిర్మాణ పనులను చేపడుతున్నట్లు తెలిపారు. మార్కెట్‌లో క్యాంటీన్, రైతుల కోసం విశ్రాంతి భవనం, నూతన షెడ్లను ఏర్పాటు చేయడం జరిగిందని త్వరలో ప్రారంభించడం జరుగుతుందన్నారు. మంత్రులు మహమూద్‌అలీ, నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్యే బలాల సహకారంతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని వివరించారు. తెలంగాణ ఛాంబర్ ఆఫ్ అగ్రి ట్రేడర్స్ అధ్యక్షుడు దేవర రాజేశ్వర్ మాట్లాడుతూ నూతన డ్రైనేజీ నిర్మాణానికి నిధులు కేటాయించిన ఎమ్మెల్యే బలాల, చైర్‌పర్సన్ అనితానాయక్‌కు అభినందనలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు మైల రవికాంత్,బట్కిరి విద్యానంద్, నరేష్, రాముయాదవ్, లలిత, సల్మాన్‌ఖాన్,ఎజాస్, మాణిక్‌రావు, యాదగిరి, తెలంగాణ ఛాంబర్ ఆఫ్ అగ్రి కల్చర్ అధ్యక్షుడు దేవర రాజేశ్వర్, ప్రధాన కార్యదర్శి బట్కిరి వివేకానంద్, ఆనియన్ అసోసియేషన్ అధ్యక్షుడు చేగురి వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి దుగ్గు జగదీష్, ఉపాధ్యక్షుడు దుగ్గు విజయకుమార్, కోశాధికారి గ్రేడ్ 3 కార్యదర్శి రవీందర్‌రెడ్డి, అభిషేకం తదితరులు పాల్గొన్నారు.

## నిలిపి వేసిన మంచి నీటి పైప్‌లైన్ పనులు వెంటనే ప్రారంభించాలని బిజెపి పోరాటం




పైప్‌లైన్ పనులను ప్రారంభించాలని నిరసన చేస్తున్న బిజెపి నాయకులు

**వనస్థలిపురం, ఆగస్టు 28 ప్రభాతవార్త :** బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ శ్రీ శ్రీనివాసకాలనీలో నిలిపివేసిన మంచినీటి పైప్‌లైన్ పనులను వెంటనే ప్రారంభించాలని రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు సామ రంగారెడ్డి, కార్పొరేటర్లు మొద్దు లచ్చిరెడ్డి, కళ్లెం నవజీవన్‌రెడ్డి, కొప్పుల నరసింహారెడ్డి చింతల అరుణ సురేందర్‌యాదవ్, బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డిలు జలమండలి ఆఫీస్ ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ లచ్చిరెడ్డి మాట్లాడుతూ కాలనీలో మంచినీటి పైప్‌లైన్ ప్రారంభించే వరకు జలమండలి కార్యాలయం వద్ద నిరాహార దీక్ష చేస్తానని అధికారులతో చెప్పడంతో బుధవారం పనులు ప్రారంభిస్తామని జలమండలి జి.ఎం తెలుపడంతో నిరసనను విరమించుకున్నారు.

## ఘనంగా నవ భారత్ కాలనీలో పోచమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన





ప్రతిష్టాప కార్యక్రమంలో పాల్గొన్న మల్‌రెడ్డి రాంరెడ్డి, చైర్‌పర్సన్ అనితానాయక్, కాకుమాను సునీల్, మంచిరెడ్డి ప్రశాంత్‌రెడ్డి, కొత్తకుర్మ సత్తయ్య తదితరులు

**తుర్కయంజాల్, ఆగస్టు 28 ప్రభాతవార్త :** తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమ్మగూడ 22వ వార్డు నవ భారత్ కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీ శ్రీ పోచమ్మ ఆలయంలో పోచమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని కౌన్సిలర్ కొసికె ఐలయ్య, ఆలయ కమిటీ సభ్యులు, కాలనీవాసుల సమక్షంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో నిర్వహించిన పూజ, హోమం కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ రాంరెడ్డి, ఐలయ్యలతో కలిసి పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్‌రెడ్డి, కౌన్సిలర్ టిపిసిసి సభ్యులు కాకుమాను సునీల్, కుంట ఉదయశ్రీ గోపాల్‌రెడ్డి, పుల్లగుర్రం కీర్తన విజయానంద రెడ్డి, నాయకులు ధనరాజ్‌గౌడ్, మహేందర్‌రెడ్డి, చెన్నయ్య, ఆలయ కమిటి అధ్యక్షులు రాజేశ్వర్‌రెడ్డి, నవభారత్ కాలనీ అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీశైలం యాదవ్, కొండల్‌రెడ్డి, పర్వతరెడ్డి, మల్లారెడ్డి, అత్తిరెడ్డి, రాజవర్ధన్, మనోహర్, చంద్రశేఖర్‌రెడ్డి, మురళి గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బండారి లక్ష్మారెడ్డికి కాలనీవాసుల సన్మానం



బండారి లక్ష్మారెడ్డిని సన్మానిస్తున్న కౌండిన్యనగర్ కాలనీ వాసులు

**నాచారం, ఆగస్టు 28 ప్రభాతవార్త :** ఉప్పల్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డిని నాచారం కౌండిన్యనగర్ కాలనీవాసులు స్థానిక హనుమాన్ దేవాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అభ్యర్థి బిఎల్ఆర్ స్థానిక సమస్యల పరిష్కరిస్తానని కాలనీవాసులతో మాట్లాడి తనకు మద్దతు తెలుపాలని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పూట్కూరి కాశీ విశ్వనాథ్ గౌడ్, వి.కుమార్ గౌడ్, వి.రాజేష్‌గౌడ్, దేవేందర్‌గౌడ్, ఎం.రాజుగౌడ్, భూపాల్‌రెడ్డి, శ్రీకాంత్‌గౌడ్, వి.చందుగౌడ్, వి.సంతోష్‌గౌడ్, మనోహర్, సుధాకర్‌రెడ్డి, సాయితో పాటు పలువురు పాల్గొన్నారు.

## అలుపెరుగని నాయకురాలిగా మంత్రి సబితాఇంద్రారెడ్డి అరుదైన రికార్డు

### ఒకే రోజు 60 కార్యక్రమాలు..15 గంటలపాటు ప్రజల మధ్య

**సరూర్‌నగర్, ఆగస్టు 28 ప్రభాతవార్త:** నిత్యం ప్రజా క్షేత్రంలో ఉండే తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పట్లోళ్ళ సబితా ఇంద్రారెడ్డి చరిత్ర సృష్టించారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న మహేశ్వరం నియోజకవర్గంలో ప్రతి రోజూ అందుబాటులో ఉండే ఆమె ఆదివారం ఒకే రోజు ఏకంగా 15 గంటల పాటు ప్రజల్లోఉండి అరుదైన రికార్డు సృష్టించారు. ఉదయం నుండి అర్ధరాత్రి వరకు ఆమె నియోజకవర్గంలోని ప్రాంతాల్లో పర్యటించి అలుపెరుగని నాయకురాలిగా వార్తల్లోకెక్కారు. ఆదివారం ఉదయం 6.30 గంటలకే ఇంటి నుండి నుండి బయలు దేరిన ఆమె బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని పలు డివిజన్లలో రూ.12.38కోట్లతో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి ఏకంగా 60 శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయడం విశేషం. ఉదయం ప్రారంభమైన మంత్రి పర్యటన మధ్యాహ్నం ఎండలో సాగితే రాత్రి వర్షంలో కొనసాగడం గమనార్హం. భోజన విరామం సమయంలోనూ ఆమె బిజీగా గడిపారు. వివిధ పార్టీల నుండి వచ్చిన వారికి బిఆర్ఎస్ కండువాలు కప్పిన ఆమె ఆ తర్వాత వికలాంగులకు పెరిగిన పింఛన్ పత్రాలు అందజేసారు. అంతకు ముందు ఆమె మీర్‌పేట్‌లో సతీ వియోగం పొందిన మాజీ ఎంపిటిసి లలితా జగన్‌ను, కుర్మల్‌గూడలో రోడ్డు ప్రమాద మృతుని కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. మొత్తం మీద ఉదయం నుండి అర్ధరాత్రివరకు ప్రజలమధ్యే ఉంటూ అలుపెరుగని నాయకురాలిగా సబితారెడ్డి నియోజకవర్గంలో చర్చనీయమయ్యారు.

## రాష్ట్రాన్ని నిండా ముంచిన తోడు దొంగలు ప్రధాని మోడీ, సిఎం కేసీఆర్‌లు : రామ్‌రెడ్డి



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న మల్‌రెడ్డి రామిరెడ్డి ఇతర నాయకులు

**ఎల్.బి.నగర్, ఆగస్టు 28 ప్రభాతవార్త:** తెలంగాణను నిండా ముంచిన తోడు దొంగలు మోడీ, కేసీఆర్‌లపై తిరగబడి తరిమికొడదామని ఎల్బీనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి మల్‌రెడ్డి రాంరెడ్డి పేర్కొన్నారు. చైతన్యపురి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం బీఆర్ఎస్, బీజేపీలపై ప్రజా చార్జ్ షీట్ కరపత్రాలు, పోస్టల్ కార్డ్స్‌ను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ముఖ్య నేతల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత పదేళ్లుగా కేసీఆర్ నమ్మించి మోసం చేసిన విధానం గురించి వివరిస్తూ టీపీసీసీ ఆదేశాల మేరకు పోస్టల్ కార్డులు, కరపత్రాలను విడుదల చేశామన్నారు. ఈ కరపత్రాలను అన్ని డివిజన్లో పంపిణీ చేయాలని డివిజన్ అధ్యక్షులకు సూచించారు. ఇచ్చిన హామీలను సిఎం కెసిఆర్ ప్రభుత్వం నెరవేర్చకుండా దళితుల భూములను లాక్కున్నారని ఆరోపించారు. టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి యోగేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడిన తర్వాత జరిగిన రెండు ఎన్నికలలో బిఆర్ఎస్‌ను ఓడించారని, మరోసారి ఎల్బీనగర్‌లో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుర్రం శ్రీనివాస్‌రెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, బద్దుల వేణుగోపాల్‌యాదవ్, ఎర్రవెల్లి మంజులారెడ్డి, కుట్ల నర్సింహాయాదవ్, మల్లారపు శ్రీనివాస్, గజ్జి శ్రీనివాస్‌యాదవ్, మక్సూద్ అలీ, బోడ రాజశేఖర్, రమేష్‌నాయక్, జైపాల్ రెడ్డి, కృష్ణారెడ్డి, కిరణ్ పాల్గొన్నారు.

## కమ్యూనిటీ హాల్ కాంపౌండ్ వాల్ పనులకు శంకుస్థాపన : కౌన్సిలర్ హరిత

**తుర్కయంజాల్, ఆగస్టు 28 ప్రభాతవార్త :** తుర్కయంజాల్ మున్సిపాలిటీ 9వ వార్డు ఎన్ఎస్ఆర్‌నగర్‌కాలనీలో అంబేద్కర్ కమ్యూనిటీహాల్, కాంపౌండ్ వాల్ నిర్మాణానికి 5 లక్షల రూపాయలు కేటాయించినట్లు తెలిపారు. మున్సిపాలిటీ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ రామ్‌రెడ్డి సహాయ సహకారంతో కౌన్సిలర్ రేవెల్లి హరిత యాదగిరి కాలనీవాసులతో కలిసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలనీ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సామ భీమ్‌రెడ్డి, భద్రయ్య, బండి ప్రవీణ్, ధారా వెంకటేష్, శ్రీనివాస్, జయరాంరెడ్డి, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## అమిత్‌షాకు అందెల స్వాగతం.. సన్మానం



అమిత్ షాను సన్మానించిన అందెల శ్రీరాములుయాదవ్ తదితరులు

**సరూర్‌నగర్, ఆగస్టు 28 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర బిజెపి ఆధ్వర్యంలో ఖమ్మంలో జరిగిన రైతుగోస.. బిజెపి భరోసా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు మహేశ్వరం నియోజకవర్గ బిజెపి ఇంఛార్జి అందెల శ్రీరాములుయాదవ్ స్వాగతం పలికి సన్మానించారు. ఇటీవల మహేశ్వరం నియోజకవర్గంలో మంత్రి క్యాంపు కార్యాలయం ముట్టడి సందర్భంగా పోలీసులు అరెస్టు చేసే క్రమంలో జరిగిన పెనుగులాటలో భుజం గాయానికి గురైన అందెల ఖమ్మం తరలివెళ్ళి హెలిప్యాడ్ వద్ద అందెలను కలిసి స్వాగతం పలికారు. అందెలతో పాటు పలువురు నాయకులు అమిత్‌షాకు స్వాగతం పలికి శాలువాలతో సన్మానించారు.

## ఉస్మానియా యూనివర్సిటీ తీజ్ ఉత్సవంలో మేయర్ చిగిరింత పారిజాత

**సరూర్‌నగర్, ఆగస్టు 28 ప్రభాతవార్త:** ఉస్మానియా యూనివర్సిటీలో జరిగిన తీజ్ ఉత్సవంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి పాల్గొన్నారు. జెఎసి ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన తీజ్ ఉత్సవ ఆహ్వానం మేరకు ఆమె అక్కడికి వెళ్ళి ఉత్సవంలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఆమెతో పాటు కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, రవినాయక్, వెంకటేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## మహేశ్వరం నియోజకవర్గంలో బిజెపి జెండా ఎగురవేసి తీరుతాం: అందెల

**సరూర్‌నగర్, ఆగస్టు 28 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలో బిజెపి జెండా ఎగురవేసి తీరుతామని పార్టీ నియోజకవర్గ ఇంఛార్జి అందెల శ్రీరాములు యాదవ్ స్పష్టం చేశారు. బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని గాంధీనగర్‌కు చెందిన బిజెపి నాయకుడు మహేందర్ ఆధ్వర్యంలో పలువురు యువకులు అందెల సమక్షంలో బిజెపిలో చేరారు. ఈ సందర్భంగా ఆయన పార్టీలో చేరిన మహేష్, నరేందర్‌కుమార్ తదితరులకు కండువాలు వేసి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బిజెపిపై విశ్వాసంతోనే యువత, మహిళలు పార్టీలో చేరుతున్నారని తెలిపారు. వారందరి నమ్మకాన్ని నిలబెట్టుకొని నియోజకవర్గంలో పార్టీ పతాకాన్ని రెపరెపలాడిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బడంగ్‌పేట్ కార్పొరేషన్ బిజెపి అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్ రెడ్డి, బిజెవైఎం అధ్యక్షుడు రాళ్ళగూడెం రామకృష్ణారెడ్డి, నిమ్మల శ్రీకాంత్ గౌడ్, తోట అరవింద్‌రెడ్డి, నిమ్మల రవికాంత్‌గౌడ్, అమరేందర్‌రెడ్డి, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.35లక్షలతో సీసీ రోడ్డు పనులు : మైనంపల్లి



సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు

**నేరెడ్‌మెట్, ఆగస్టు 28 ప్రభాతవార్త :** మల్కాజిగిరి నియోజకవర్గ పరిధిలోని డివిజన్లలను పూర్తి స్థాయిలో అభివృద్ధి పరచడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు అన్నారు. సోమవారం నియోకజవర్గ పరిధిలోని వినాయక్‌నగర్‌డివిజన్ డి.ఎ.విపాఠశాలవద్ద, వినోభనగర్‌లో రూ. 35లక్షలతో ఏర్పాటు చేసిన సీసీ రోడ్డు పనులను ఆయన స్థానిక కార్పొరేటర్, బి.ఆర్.ఎస్ సీనియర్ నాయకులతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డివిజన్ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను దశల వారిగా పరిష్కరిస్తామన్నారు. ప్రజలు నేరుగా తనను కలవచ్చని, వారి సమస్యలను పరిష్కరించేందుకే తాను ఉన్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు క్యానం రాజ్యలక్ష్మి, ప్రేమ్‌కుమార్, ఈఈ లక్ష్మణ్, డీఈ లౌక్య, ఏఇ దీపక్, నాయకులు సతీష్‌కుమార్, గుండా నిరంజన్, సూరి, ఓంప్రకాష్, ఫరీద్, ప్రభాకర్, బాలక్రిష్ణ, పేపర్ శ్రీను, భాస్కర్, పిట్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ నియోజక వర్గ ఎమ్మెల్యే టికెట్‌ను ఎన్వీఎస్ఎస్‌కే కేటాయించాలి : రాంప్రదీప్

**కుషాయిగూడ, ఆగస్టు 28 ప్రభాతవార్త :** 2014లో బిజెపి నుండి ఎమ్మెల్యేగా గెలిచి ఉప్పల్ నియోజకవర్గాన్ని అభివృద్ధిపథంలో నడిపించిన బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్‌కు మరోసారి ఉప్పల్ నియోజకవర్గ బిజెపి అభ్యర్థిగా అవకాశం కల్పించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బిజెపి అధికార ప్రతినిధి మునుగంటి రామ్‌ప్రదీప్ పేర్కొన్నారు. మీర్‌పేట్ డివిజన్ తిరుమల నగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అప్పటి కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి వెంకయ్యనాయుడు సహకారంతో సుమారు 1500 కోట్ల కేంద్ర నిధులతో ఉప్పల్ నియోజకవర్గ పరిధిలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. ఎమ్మెల్యేగా ప్రజల్లో మంచి పేరు సాధించిన ఎన్‌విఎస్ఎస్‌కు నియోజకవర్గ బిజెపి అభ్యర్థిగా టికెట్ కేటాయిస్తే భారీ మెజార్టీతో విజయకేతనాన్ని ఎగరవేయడం ఖాయమని కార్యకర్తలు నాయకులు అభిప్రాయపడుతున్నారని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర బిజెపి కన్వీనర్ పూసల బ్రహ్మాచారి, నాయకులు గోపాల్‌రెడ్డి, తాళ్లపల్లి లింగం, తిమ్మారెడ్డి, ఉమారాణి, భగవంతుల శశికళ, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రామంతాపూర్‌లో రాగిడి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో బస్తీ నిద్ర కార్యక్రమం



రామంతాపూర్‌లో బస్తీ నిద్ర కార్యక్రమంలో పాల్గొన్న లక్ష్మారెడ్డి తదితరులు

**ఉప్పల్, ఆగస్టు 28 ప్రభాతవార్త :** ఉప్పల్ నియోజకవర్గం పరిధిలోని రామంతాపూర్‌లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత రాగిడి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో బస్తీ నిద్ర కార్యక్రమం చేపట్టారు. రామంతాపూర్ పబ్లిక్ స్కూల్ వద్ద రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాలలువేసి యాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా నెహ్రూ నగర్, ఇందిరానగర్, రాజేంద్రనగర్, గాంధీనగర్, శ్రీరామకాలనీ, శ్రీనగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ప్రజా సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని, సమస్యల పరిష్కారంలో పాలకులు విఫలం అయ్యారని ఆరోపించారు. బిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్లు గడిచినా నేటికి సదుపాయాలు కల్పించలేదని ఆరోపించారు. ప్రజా సమస్యలపై పోరాటం తీవ్రతరం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు మేడల మల్లికార్జున్‌గౌడ్, డివిజన్ అధ్యక్షుడు ఎం.డి.రఫీక్, దర్శనం వినోద్, ఆవులగడ్డ శ్రీనివాస్‌యాదవ్, వి.సంజీవరెడ్డి, పత్తికుమార్, సంజయ్‌జైన్, అబ్దుల్ రషీద్, గణేష్‌నాయక్, షేక్ మదర్‌వలీ, సుధాకర్‌శెట్టి, వంశీయాదవ్, ఆశు, షేక్ జహంగీర్, కరిపె సంతోష్, శ్రవన్ తదితరులు పాల్గొన్నారు.

## బీబీఏ కోర్సులో చేరడానికి సెప్టెంబరు 4వ తేదీ వరకు దోస్త్ స్పెషల్ డ్రైవ్

**హయత్‌నగర్, ఆగస్టు 28 ప్రభాతవార్త:** హయత్‌నగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2023-24 విద్యాసంవత్సరానికి బి.బి.ఏ కోర్సులో చేరడానికి ఈనెల 28నుంచి సెప్టెంబరు 4 వరకు అవకాశాన్ని పొడిగించినట్లు ప్రిన్సిపల్ జోత్స్నప్రభ ఒక ప్రకటలో తెలిపారు. ఈమేరకు దోస్త్ ద్వారా స్పెషల్ డ్రైవ్‌ను కొనసాగిస్తున్నట్లువివరించారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు వెబ్‌ఆప్షన్ ఇవ్వాలని సూచించారు. బహుళ జాతికంపెనీలు, దేశీయ కార్పొరేట్ సంస్థలు, విదేశాల్లో ఎంబీఏ చదవడానికి, అన్ని ప్రభుత్వ ఉద్యోగాలకు బీబీఏ కోర్సు ఇతర సాధారణ డిగ్రీలతో సమానంగా అవకాశాలుంటాయని విద్యార్థులు స్పెషల్ డ్రైవ్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## జనప్రియ కాలనీలో ఓటరు నమోదు కార్యక్రమం



ఓటర్ నమోదులో పాల్గొన్న బిఆర్ఎస్ నాయకులు

**ఎల్.బి.నగర్, ఆగస్టు 28 ప్రభాతవార్త:** ఆర్కేపురం డివిజన్ జనప్రియ కాలనీలో బిఆర్ఎస్ పార్టీ ఆర్కేపురం డివిజన్ సీనియర్ నాయకుడు శ్యాం గుప్తా ఆధ్వర్యంలో ఉచిత ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యామ్ గుప్తా మాట్లాడుతూ 18 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్క యువతీ యువకులు తప్పనిసరిగా ఓటు నమోదు చేయించుకోవాలని సూచించారు. ఓటు హక్కు ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ నాయకులు మురుకుంట్ల అరవింద్ శర్మ, పెండ్యాల నగేష్, ఎస్కే మహమ్మద్, రామాచారి,కొంద్రు శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి, జగన్మోహన్ రెడ్డి, లింగస్వామి, కంచర్ల శేఖర్, భరత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద విద్యార్థులకు మధురా ట్రస్ట్ చేయూత

**ఉప్పల్, ఆగస్టు 28 ప్రభాతవార్త :** నిరుపేద విద్యార్థులకు మధురా చారిటబుల్ ట్రస్ట్ తగు చేయూత అందిస్తుందని ట్రస్ట్ సభ్యులు పేర్కొన్నారు. ఈ మేరకు మధురా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉప్పల్ ప్రభుత్వ పాఠశా ల విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్య క్రమంలో ట్రస్ట్‌సభ్యులు రాగిడి రియాన్‌రెడ్డి, పి.నరసింహారెడ్డి, వంజరి సంతోష్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు తమ వంతు సహా యం అందజేస్తున్నామని తెలిపారు. పేదలకు తమ వంతు సహకారం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ నేతలు జైరుద్దీన్, అమీర్, శ్రవణ్‌కుమార్, రాజ్‌కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## సిఎం కెసిఆర్ తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన వరం టీమ్స్ ఆస్పత్రి : ఎమ్మెల్యే



టీమ్స్ ఆస్పత్రి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తదితరులు

**ఎల్.బి.నగర్, ఆగస్టు 28 ప్రభాతవార్త:** ఎల్బీనగర్ నియోజకవర్గం ప్రజలకు సిఎం కేసీఆర్ టీమ్స్ ఆసుపత్రిని వరంగా ఇచ్చి ప్రజల ఆరోగ్య సంక్షేమానికి కృషి చేస్తున్నారని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. గడ్డిఅన్నారం ఫ్రూట్ మార్కెట్‌లో నిర్మిస్తున్న టిమ్స్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సెల్లార్ పనులను అధికారులతో కలిసి ఎమ్మెల్యే సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ రూ.1200 కోట్లతో 1000 పడకల ఆసుపత్రిని కానుకగా ఇచ్చారని అన్నారు. గ్రౌండ్ ప్లస్ 26 అంతస్తులతో దేశంలోనే భారీ భవనంతో ఆస్పత్రి నిర్మిస్తున్నారని తెలిపారు. వేలాది మంది ప్రజానీకం ఆరోగ్య సమస్యలతో నగర నలుమూలల నుంచి నిమ్స్, ఉస్మానియా, గాంధీ ఆస్పత్రులకు వైద్యసేవల కోసం వస్తున్నారని దాని దృష్టిలో పెట్టుకొని ముఖ్యమంత్రి జంట నగరాల నలు దిక్కులా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులను అందుబాటులోకి తీసుకువస్తున్నారన్నారు. మేనిఫెస్టోలో చెప్పినట్లుగా గడ్డిఅన్నారం ఫ్రూట్ మార్కెట్‌ను తరలించి, ఇంత పెద్ద ఆసుపత్రి నిర్మించడం సాధారణ విషయం కాదని, ప్రతిపక్ష పార్టీలు పనులు ప్రారంభం కాలేదని, ప్రజలను ఎమ్మెల్యే మోసం చేస్తున్నాడని మాపై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులకు చిత్తశుద్ధి లేకే ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎవరెన్ని ఆరోపణలు చేసిన నియోజకవర్గ అభివృద్ధితోపాటు ప్రజల మధ్యనే ఉంటానని అదే ప్రతిపక్ష నాయకులకు చెంప పెట్టు అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, చైతన్యపురి డివిజన్ బారాస అధ్యక్షులు తోట మహేష్‌యాదవ్, శరత్‌చంద్ర, జగదీష్ యాదవ్, శ్రీకాంత్, అధికారులు భాస్కర్ రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

## రూ.19లక్షలతో పార్కు అభివృద్ధి పనులు



పార్కు అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ గీత తదితరులు

**ఉప్పల్, ఆగస్టు 28 ప్రభాతవార్త :** చిలుకానగర్ డివిజన్ నార్త్ కల్యాణపురిలో రూ.19లక్షల వ్యయంతో పార్కు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ పేర్కొన్నారు. ఈ మేరకు మున్సిపల్ డిఇ నిఖిల్ రెడ్డి, ఎఇ రాజ్‌కుమార్, హార్టికల్చరల్ డిపార్ట్‌మెంట్ ఎఇ నరసింహారావు తదితరులతో కలిసి పార్కు అభివృద్ధి పనులు పరిశీలించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలో అత్యాధునిక హంగులతో పార్కు అభివృద్ధి పనులు చేపడుతున్నామని, ప్రజలకు ఆహ్లాదం కోసం పార్కులు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. పార్కులో వాకింగ్‌ట్రాక్, ఓపెన్ జిమ్ ఏర్పాటు చేసామని త్వరలో అందుబాటులోకి తీసుకుని వస్తామన్నారు. పార్కు పెన్సింగ్ వేయించాలని స్థానికులు విన్నవించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బన్నాల ప్రవీణ్, ఏదుల కొండల్‌రెడ్డి, కె.జగన్, నారాయణరెడ్డి, శ్రీనివాస్, బాలు, పలువురు కాలనీ సంఘం నేతలు పాల్గొన్నారు.

## ఇందు అరణ్య కాలనీలో 60 అడుగుల జాతీయ పతాకం ఆవిష్కరణ : ఎమ్మెల్యే



జాతీయ పతాక ఆవిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ శ్రీలతాశోభన్‌రెడ్డి, అడిషనల్ కలెక్టర్ భూపాల్‌రెడ్డి

**హయత్‌నగర్, ఆగస్టు 28 ప్రభాతవార్త:** పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ తట్టి అన్నారం గ్రామపరిధిలోని ఇందుఅరణ్య కాలనీలో ఏర్పాటు చేసిన 60 అడుగుల ఎత్తైన జాతీయపతాకాన్ని ఆదివారం రాత్రి ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సాధారణంగా ప్రభుత్వకార్యాలయాలు, పెద్దపెద్ద సంస్థలు భారీ జాతీయ పతాకాన్ని ఏర్పాటు చేస్తుంటారని తెలిపారు. ప్రైవేటు నివాస గృహాలకు చెందిన ప్రతినిధులు భారీ జాతీయ పతాకాన్ని ఏర్పాటు చేయడం హర్షనీయమని పేర్కొన్నారు. పతాకావిష్కరణలో ఎమ్మెల్యేతో పాటు జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ శ్రీలతశోభన్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి, కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## హనుమాన్ ఆలయ పునర్నిర్మాణానికి విరాళం

**సరూర్‌నగర్, ఆగస్టు 28 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మల్లాపూర్ ఆంజనేయస్వామి దేవస్థానం పునర్నిర్మిణానికి టిపిసిసి కార్యదర్శి యెల్మేటి అమరేందర్‌రెడ్డి విరాళం అందజేశారు. గ్రామస్తులు, దాతల సహకారంతో ఆలయ కమిటీ వారు పునర్నిర్మించనున్న దేవాలయానికి ఆయన రూ.51 వేలను తన వంతు విరాళంగా అందజేశారు. ఈ మేరకు బాలాపూర్‌లోని తన నివాసంలో విరాళం చెక్కును ఆలయ నిర్మాణ ప్రతినిధులకు అందజేశారు. కార్యక్రమంలో వెంకటాపూర్ మాజీ ఉప సర్పంచ్ పోరెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ వార్డు సభ్యుడు వరికుప్పల వెంకటేశ్, కె.శ్రీనివాస్‌రెడ్డి, కె.మహిపాల్‌రెడ్డి, వి.సుధీర్, కె.నవీన్, డి.రాజు, గోపాల్, శ్రీను, సురేష్, శంకర్, విజయ్, నరసింహ, ఈశ్వర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ పనుల పరిశీలన : కార్పొరేటర్ శ్రీవాణి



డ్రైనేజీని పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి అంజన్‌కుమార్

**ఎల్.బి.నగర్, ఆగస్టు 28 ప్రభాతవార్త:** డివిజన్లో జరుగుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులను సరూర్ నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అంజన్ కుమార్ పరిశీలించారు. డివిజన్లోని వెంకటేశ్వరకాలనీ రోడ్ నెంబర్ 16 లో నిర్మిస్తున్న డ్రైనేజీ పనులను జలమండలి మేనేజర్ ప్రవీణ్ తో కలిసి కార్పొరేటర్ పరిశీలించారు. నిర్మాణం పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కార్పొరేటర్ సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనులు చేయాలని అన్నారు.